www.janashaktionline.com

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 45 సంచిక : 3 విజయవాడ 5-6-2012 పేజీలు : 8 వెల: రు 5.00

లోపలి పేజీల్లో...

- హిల్లరీ క్లింటన్ పర్యటన : దేశప్రయోజనాలకు అమెరికాకు లోబరిచిన పాలకులు
- కేరళ మత్స్యకారుల హత్య : ఇటాలియన్ హంతకులకు సహకరిస్తున్న పాలకులు
- జాతిపేరుతో ఈశాన్య ప్రాంత ప్రజలపై సాగుతున్న వ్యవస్థీకృత వివక్ష
- ఏఎఫ్ఎస్‌పిఏపై సుప్రీంకోర్టు తీర్పు : వెల్లడైన ఉన్నతన్యాయస్థాన దొల్లతనం
- కెనడా: క్విబెక్ రాష్ట్రంలో ఆందోళన సాగిస్తున్న విద్యార్థులపై పాశవిక నిర్బంధం
- బి.టి. వంగ సాగు హానికరం
- వివిధ ప్రపంచ దేశాలలో మేడే కార్యక్రమాలు

# 60 సంవత్సరాల పార్లమెంటు

## ప్రజాస్వామ్యం పేరుతో ప్రజావంచనకు అరవై ఏళ్ళు

**2012 మే 13వ** తేదీన పార్లమెంటుకు 60 ఏళ్ళు పూర్తయిన సందర్భాన్ని, పెద్ద ఎత్తున ప్రచారార్భాటాలతో, ప్రతిపక్షపార్టీలతో కూడి పాలకులు ఘనంగా నిర్వహించారు.

### పాలకవర్గ పార్టీల ఆనందభాష్పాలు

గత 60 సంవత్సరాలుగా భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని నిలుపుకుంటూ, ఈ సంస్థలపట్ల నమ్మకం లేదన్న వారి భావం తప్పు అని రుజువు చేసుకుంటూ వచ్చామని వారు 'ఆనందభాష్పాలు' రాల్చారు. చర్చలలో నాణ్యతను పెంచుకోవటం ద్వారా, అంతరాయాలు, గందరగోళాలను నివారించటం ద్వారా పార్లమెంటు హుందాతనాన్ని, పవిత్రతను, ఔన్నత్యాన్ని మెరుగు పరుచుకోవాలనీ, ఈ విధంగా ప్రజాస్వామ్య సూత్రాలను కాపాడి, పటిష్టపరిచే సాధనంగా పార్లమెంటును నిలపాలని వారంతా ఏకగ్రీవంగా ఒక తీర్మానాన్ని ఆమోదించారు. కార్యనిర్వహణపై నియంత్రకుడిగా పార్లమెంటు పాత్రను నిలిపివుంచేందుకు వారు కంకణ బద్ధులయ్యారు. పార్లమెంటుపట్ల ప్రజలకు తొలగిపోతున్న భ్రమలను నిలిపివుంచి (భ్రమలు తొలగిపోకుండా) ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోబూనుకున్నారు. సమాచార హక్కుచట్టం, గృహహింస (నిరోధక) చట్టం, విద్యాహక్కుచట్టం, (హిందూ) మహిళలకు ఆస్తిలో సమానహక్కుచట్టం వంటి చట్టాలను పార్లమెంటు చేసిందని చూపటం ద్వారా, భారత ప్రజల అవసరాలు, ఆకాంక్షలు సంపూర్ణంగా ఈ చట్టాలు చేయటంతోనే నెరవేరాయన్న విధంగా పేర్కొంటూ పార్లమెంటు గొప్పతనాన్ని కొనియాడారు. భారత ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందనేదానికి, ఇన్ని సంవత్సరాలకాలంగా పార్లమెంటరీ వ్యవస్థ స్థిరంగా కొనసాగటమే రుజువుగా పేర్కొన్నారు.

ప్రతిపక్ష పార్టీల నాయకులు కూడా తమవంతుగా మన పార్లమెంటరీ వ్యవస్థను ప్రస్తుతిస్తూ అన్ని విధాలా ఈ వ్యవస్థను పరిరక్షించి, కాపాడుతామని ప్రతినబూనారు.

ప్రధాన ప్రతిపక్షపార్టీ అయిన బిజెపి –మహిళా ప్రాతినిధ్యాన్ని పెంపుజేయటం ద్వారా మరింత ఎక్కువ మంది మహిళలను సభలో పాల్గొనేట్లు చేస్తే, తీవ్రవాదాన్ని, చొరబాటు దారుల్ని, అణచివేయగలిగితే, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మరింత సఫలమౌతుందని పేర్కొంది. 'వామపక్ష' సిపిఎం ప్రతినిధులు మాట్లాడుతూ పార్లమెంటులోని ఎగువ, దిగువ సభలను మెరుగైన భవిష్యత్తుకోసం, మెరుగైన పార్లమెంటరీ వ్యవస్థ దిశగా రూపొందించాలనే తమ అభిలాషను వ్యక్తం చేశారు. పార్లమెంటరీ కార్యక్రమాల నిర్వహణ, కార్యక్రమాలు జరిగిన సమయం అనే అంశాలపై ఎక్కువ భాగం పార్లమెంటు సమర్థత ఆధారపడి వుంటుందని వారు పేర్కొన్నారు. అవసరమైతే, పార్లమెంటు సమర్థతని మెరుగుపరిచేందుకు ఒక సంవత్సర కాలంలో కనీసం 100 సమావేశాలు జరిగే వీలుకల్పించే విధంగా రాజ్యాంగాన్ని సవరించాలని కూడా వారు సూచించారు. పార్లమెంటులో ఆయా పార్టీలకు వచ్చిన ఓట్ల శాతానికనుగుణంగా ప్రాతినిధ్యం వుండే విధంగా ఆలోచించాలని కూడా వారు సూచించారు.

ఏకగ్రీవంగా పార్లమెంటు మాత్రమే చట్టాలను చేయగలదని, చేస్తుందని; చట్టాలను రూపొందించేది పార్లమెంటు వెలుపలున్న మూకలు ఎంత మాత్రంకాదని పార్లమెంటు సభ్యులంతా నొక్కి చెప్పారు.

### సాధారణ ప్రజల చేదు అనుభవాలు

కానీ, భారత ప్రజానీకానికి మాత్రం ఈ సందర్భాన్ని గుర్తు చేసుకొని ఆనందించడానికి ఏమీ మిగల్లేదు. తద్భిన్నంగా తమ నిజమైన అవసరాలు, ఆకాంక్షలను గుర్తించటంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, పార్లమెంటుల ప్రయోజకత్వాన్ని గూర్చి వారు ఒక్కసారి సింహావలోకనం చేసుకుంటున్నారు. ఈ ప్రయోజనాలను సాధించటంలో పార్లమెంటు విఫలమైందని వారు భావిస్తున్నారు. తమ ప్రయోజనాలు, ఆకాంక్షలు, కోర్కెలన్నీ ప్రజాస్వామ్యం పేరుతో, ఈ పార్లమెంటరీ వ్యవస్థ ద్వారా ఏ విధంగా సూటిగా వ్యతిరేకించబడ్డాయో, ఆ గత చేదు అనుభవాలను వారు జ్ఞప్తికి తెచ్చుకుంటున్నారు. అంతేగాక మన దేశ ప్రయోజనాలకు, సార్వభౌమత్వానికి విరుద్ధంగా పార్లమెంటు ఏ విధంగా వ్యవహరించిందో వారు మననం చేసుకుంటున్నారు. అరవై సంవత్సరాల తన దీర్ఘప్రయాణం తర్వాత కూడా ఆకలి, పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం వంటి మౌలిక సమస్యలేవీకూడా ఈ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో పరిష్కారం కాక పోవటాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. హుందాతనంతో కూడిన చర్చలు, పార్లమెంటు సమావేశాల పొడిగింపు, పార్లమెంటు కార్యక్రమాల సక్రమ నిర్వహణలనే చర్చల ద్వారా, తమ ప్రయోజనాలు, ఆకాంక్షలు; ఆహారం, నివాసం, ఉపాధి వంటి తమ మౌలిక అవసరాల సమస్యలు ఏ విధంగా పరిష్కరింపబడతాయని వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ధరల పెరుగుదలను 'ఘనతవహించిన' పార్లమెంటు ఎందుకు అరికట్టలేకపోయిందనివారు నిలదీస్తున్నారు. స్వాతంత్ర్యం, హుందాతనం, ఔన్నత్యం, గతకాలపు ఘనత, ప్రాచీన భారత ఉన్నత సంస్కృతీ విలువల వంటి పడికట్టు, సొగసైన పదాలను వినటానికి వారి విసుగెత్తిపోయి వున్నారు. ఇంతకాలంగా ఈ విధమైన పదాలు, నినాదాలతో తమజీవన పరిస్థితులేమాత్రం మెరుగుపడకపోగా తాము మోసగించబడుతున్నామని వారు భావిస్తున్నారు. పార్లమెంటరీ వ్యవస్థ స్థిరత్వమో, లేదా ప్రజాస్వామ్య స్థిరత్వమో అర్థంలేనివనీ, తమ ఆకాంక్షల, కోర్కెల స్వాంతనకు ఇవేవీ పరిష్కారంజూపవని తమ స్వీయ అనుభవాలనుండే వారు ఒక ఖచ్చితమైన నిర్ధారణకు వచ్చారు. ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి నడుమ దేశంపట్ల, దేశాన్ని నడిపే విధానాలపట్ల ఏకీభావమున్నదని వారు అవగాహన చేసుకున్నారు. పార్లమెంటు తమ వాస్తవికమైన ప్రతినిధి కానే కాదని గత ఆరు దశాబ్దాల తమ అనుభవాలతో వారు అర్థంచేసుకున్నారు.

భారత ప్రజాస్వామ్యం ఎంతో మహత్తరమైనదీ; ప్రజలచేత, ప్రజలనుండి ప్రజలకోసం పనిచేసేదీ అయితే, ప్రపంచంలో మానవ వనరుల అభివృద్ధి సూచికలో భారతదేశం అత్యంత కనిష్టస్థాయిలో ఎందుకుందని వారు ప్రశ్నిస్తున్నారు. ఐనప్పుడు, అది పార్లమెంటరీ ప్రజాస్వామ్యమైనా, మరేదైనా భారత ప్రజల కొరిగేదేముందంటున్నారు. ఈ 'సమున్నత' పార్లమెంటు, 'ప్రజాస్వామ్య దేవాలయా'ల 60 సంవత్సరాల పాలన కూడా, మానవమలాన్ని చేతులతో ఎత్తిపోసే అసహ్యకర పాకీపని విధానానికి ఎందుకు ముగింపు పలకలేకపోయిందని వారు అడుగుతున్నారు. పాకీపనిని నిషేధిస్తూ 1993లో చేసిన చట్టం ప్రకారం కనీసం ఒక్కరు కూడా ఎందుకు శిక్షింపబడలేక పోయారని వారు నిలదీస్తున్నారు. 'శక్తివంతమైన పార్లమెంటు' పాలన సాగిన ఈ 60 సంవత్సరాల కాలం తదనంతరం కూడా బాలకార్మిక వ్యవస్థ, వెట్టి చాకిరీ వంటి అమానవీయ విధానాలు వెరపులేకుండా నిర్భయంగా కొనసాగటానికి కారణమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల, భాషల, మతాల, కులాల, జాతుల, జనాభానుండి ఒకరో, మరికొంతమందో పార్లమెంటు సభ్యులుగా వుండటాన్నే, → భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా చూపుతున్నారు మినహా, వీరి సాధారణ సమస్యలన్నీ ఈ 60 సం॥లకాలం అపరిష్కృతంగా వున్నప్పుడు, వారి వారి వాస్తవికమైన ప్రాతినిధ్యాన్ని ఇంతో, మరికొంతో పెంచటంతో ఒరిగేదేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. అన్ని విభాగాల ప్రజాసమస్యల ప్రాతినిధ్య సంస్థగా పార్లమెంటును ఏ విధంగా పేర్కొనగలమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### తొలగిపోతున్న భ్రమలు

ఈ విధంగా పార్లమెంటరీ వ్యవస్థ దాని సహజమైన వర్గస్వభావం కారణంగా ప్రజల మౌలిక సౌకర్యాలను నెరవేర్చలేకపోవటంతో, వారి ఆకాంక్షలకు, అవసరాలకు ప్రాతినిధ్యం వహించలేకపోవటంతో, దాని పట్ల వారికున్న భ్రమలు తొలగిపోతున్నాయి. ప్రధానమంత్రి, ఇతర పార్లమెంటరీ పక్షాలు ముందుకు తెచ్చిన విధంగా పార్లమెంటులో హుందా పూర్వకమైన చర్చలు సాగకపోవడం, లేదా పార్లమెంటు సమావేశాల సమయం సరిపోకపోవటం వంటి వాటి కారణంగా మాత్రమే ప్రజల భ్రమలు తొలగిపోవటం లేదు. ప్రతి కులం, మతం, జాతి, తెగ, సంస్కృతికి చెందిన సాధారణ, అట్టడుగు ప్రజల తరఫున

(తరువాయి 2వ పేజీలో)

ప్రకటన

## పెట్రోల్ ధర పెంపును మొత్తంగా, వెనువెంటనే ఉపసంహరించుకోవాలి!

### 2012 మే 31న అఖిలభారత బంద్‌ను విజయవంతం చేయండి!

సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి పెట్రోల్ ధర పెంపుదలను తీవ్రంగా నిరసిస్తున్నది. పెంచిన ధరను మొత్తంగా, వెనువెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నది.

పెట్రోల్ ధర పెంపుదల ప్రజలపై భరించలేని తీవ్ర భారాల్ని మోపుతుంది. ఈ పెంపుదల లీటర్‌కు రు. 7.85 (కోలకతా) నుండి రు. 8.36 (హైదరాబాద్) గా వుంది. ప్రజల మెడలపై ఈ కత్తి గత ఆరు నెలలుగా వేళ్ళాడుతూవుంది. దానిని ప్రభుత్వం ప్రజలపై ఈనాడు మరోసారి ప్రయోగించింది. అంతర్జాతీయ విపణిలో ముడిచమురు ధరలు పెరిగాయనీ, రూపాయి విలువ పడిపోయిందనే ఆమోదయోగ్యంకాని వాదనలతో తన చర్యను సమర్థించుకో ప్రయత్నిస్తున్నది. వాస్తవంగా సమస్య ఏమంటే, భారత పాలకులు మన దేశంలోని అపార చమురు వనరులపై, మన సాంకేతిక నైపుణ్యాలపై ఆధారపడిన స్వయం సమృద్ధమైన జాతీయ చమురు పరిశ్రమను అభివృద్ధి చేసుకోవటంలో విఫలమవుతున్నారు. అమెరికా సామ్రాజ్యవాదుల వత్తిడులకు తలొగ్గి ఇరాన్‌వంటి మన మిత్ర దేశాలనుండి చౌకగానూ, ఆధారపడదగినవీ అయిన చమురు సరఫరాలను వదులుకుంటున్నారు. మనదేశంలో ఉత్పత్తి అయిన చమురు ఉత్పత్తులతో సహా చమురు ధరలను అంతర్జాతీయ మార్కెట్ ధరలతో అనుసంధానించారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు విడివిడిగా పెద్ద మొత్తంలో విధించిన పన్నులు ఆయిల్ ధరను మరింత ఖరీదైనదిగానూ, భరింపలేనిదిగానూ చేశాయి. దాదాపు అన్ని ఆటోరంగ బహుళ జాతి కంపెనీలు, తమ ఉత్పత్తి విభాగాలను మన దేశంలో తెరవటంద్వారా ప్రజారవాణా వ్యవస్థను ధ్వంసం చేస్తూ వ్యక్తిగత రవాణాను ప్రోత్సహించటం జరుగుతూవుంది. ఈ విధంగా ఆయిలు కొరకు దిగుమతి ధరలు నిరంతరాయంగా పెరుగుతూ ఆయిలు దిగుమతులపై ఆధారపడవలసి వస్తున్నది.

అన్ని నిత్యజీవితావసర వస్తువుల ధరల అదుపు లేని పెరుగుదల, రవాణా ఛార్జీల పెరుగుదల, మందులు, కూరగాయలు ధరల పెరుగుదల తదితరాలతో ఇప్పటికే ప్రజలు పిల్పి పిప్పి చేయబడుతున్నారు. ప్రస్తుత పెట్రోల్ ధర పెంపు ఈ భారాలను మరింత అధికం చేసి ప్రజలకు ఊపిరి సలపని పరిస్థితిని కల్పిస్తుంది.

భారత ప్రభుత్వం డీజిలు, వంటగ్యాసు, కిరోసిన్ ధరలను కూడా పెంచటానికి సన్నద్ధమౌతున్నది. ప్రజలకు లభించే ఎంత చిన్నపాటి సబ్సిడీ లేదా సేవనైనా పొదుపు చర్యల పేరిట కోత విధించి మానసికంగా ప్రజలు సిద్ధపడే వాతావరణాన్ని కల్పించి, ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించే పేరిట సామ్రాజ్యవాదులకు మన ఆర్థిక వ్యవస్థ ద్వారాలను మరింతగా తెరచి వుంచుతున్నది. ప్రభుత్వం ప్రజలపై అన్ని రూపాలలోనూ దాని దాడులను తీవ్రం చేసింది.

సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి, పెట్రోలు ధరలు పెంపుకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, మహిళలు, దళితులు, మరియు ఇతర అణచివేతకు గురయ్యే ప్రజలంతా ఐక్య గళాన్ని వినిపించాలని, పెట్రోలు ధర పెంపును పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేయాలని పిలుపునిస్తున్నది.

**2012 మే 31న అఖిలభారత బంద్** జరపవలసినదిగా పిలుపునిస్తున్నది. వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో జరిగే ఈ బంద్‌ను జయప్రదం చేయవలసిందిగా పిలుపునిస్తున్నది. ప్రభుత్వ ప్రజావ్యతిరేక చర్యలను పూర్తిగా వెనక్కు కొట్టేలా, ప్రభుత్వంపై సంఘటిత నిరసనోద్యమ నిర్మాణానికి సిద్ధం కావాలని, ప్రజారవాణా వ్యవస్థలను బలోపేతానికి డిమాండ్ చేయాలని పిలుపునిస్తున్నది.

**విశ్వం,**
ప్రధాన కార్యదర్శి
సిపిఐ (ఎం-ఎల్)

**27-5-2012**

## 60సంవత్సరాల... (మొదటి పేజీ తరువాయి)

నిలబడుతూ అత్యంత న్యాయసమ్మతమైన తమ కోర్కెల కనుగుణంగా వ్యవహరించటంలో విఫలమవటం వలననే ప్రజలకు పార్లమెంటు పట్ల భ్రమలు తొలగిపోతున్నాయి. అంతేగానీ, పాలకులు, మాధ్యమాలు ప్రచారం చేసిన విధంగా నెహ్రూపాలన కాలం నాటి గౌరవాన్ని కోల్పోవటం వలన మాత్రంకాదు.

తమ 60 సం॥ల చేదు అనుభవంతో 'క్రమం తప్పకుండా ఎన్నికలు' జరగటం; నిలకడగా పార్లమెంటు సమావేశమవటమనేవి ఏ విధంగానూ, ఎన్నటికీ తమ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రాజకీయ సమస్యలకు; సామాజిక అవలక్షణాల పరిష్కారానికీ మార్గం కానేకాదని ప్రజలు గ్రహించారు. ఎన్నికలలో ఒక సాధారణమైన వ్యక్తి తన సమూహానికి చెందిన ప్రజల ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహిస్తూ పోటీచేయలేడనే విషయం వారికి తెలుసు. 20–25 కోట్ల రూపాయలు వెచ్చించే ఆర్థిక స్థోమత లేకుండా ఎవరైనా పార్లమెంటు ప్రతినిధి కాలేరనీ, వ్యాపారవేత్తలు, వారి దన్నుతో వృత్తిపర రాజకీయ నాయకులు మాత్రమే పార్లమెంటులో ప్రవేశించగలరనే విషయమూ వారికి తెలుసు. 14 శాతం పార్లమెంటు సభ్యులకు నేరచరిత్ర వుందని కూడా ప్రజలకు తెలుసు. అర్థ, అంగ బలమున్నవారు మాత్రమే పార్లమెంటులోకి ప్రవేశించగలరనే విషయం కూడా వారికి తెలుసు. లోక్‌సభలో 128 మంది సభ్యులు బడా వ్యాపారవర్గాల వారున్నారు. తమ ఓటు బ్యాంకులను కాపాడుకోవటానికి కులం, మతం, ప్రాంతీయ విభేధాలను రాజకీయ పక్షాలు పెంచిపోషిస్తున్నాయనీ ప్రజలకు తెలుసు. రాజకీయ పార్టీలు తమ,తమ ప్రణాళికల్లో పేర్కొన్న విధానాలు లేదా కార్యక్రమాలపై ఆధారపడి ఆయా అభ్యర్థులకు ఓటర్లు ఓటు వేయడం లేదనీ, తమపై వస్తున్న వత్తిడులు లేదా ప్రలోభాల కారణంగానే ఓటు వేస్తున్నారనీ వారికి తెలుసు. ఎన్నికైన ప్రతినిధులు వారివారి నియోజకవర్గ పరిధిల్లోని ప్రజల ఆకాంక్షలకు, కోర్కెలకు ప్రాతినిధ్యం వహించటం లేదనీ సంకుచిత, స్వార్థ రాజకీయార్థిక ప్రయోజనాల పెంపుకోసమే వారున్నారన్న విషయమూ ప్రజలకు తెలుసు. కొందరు పార్లమెంటు సభ్యులు పార్లమెంటులో ప్రశ్నలు లేవనెత్తినందుకుగానూ డబ్బుతీసుకుంటారనే విషయమూ తెలుసు. మహిళలను విదేశాలకు ఎగుమతి చేసే అమానవీయ వ్యాపారాలలోనూ కొందరు పార్లమెంటు సభ్యులు భాగస్వాములనీ వారికి తెలుసు. ఎం.పి. నిధులను కొందరు ఎం.పి.లు తమ సొంతానికి దిగమింగారనీ వారికి తెలుసు. అనేకమంది ఎం.పి.లు బడా ట్రాన్స్‌నేషనల్ కార్పొరేటు సంస్థల ప్రభావంలో వుంటూ, ప్రజల ప్రయోజనాలను పణంగాపెట్టి, ఆ కార్పొరేట్ల ప్రయోజనాల పరిరక్షణా సేవలలో పునీతులవుతున్నారనీ తెలుసు. పార్లమెంటు ఆమోదంతో ప్రభుత్వం ద్వారా రైతులకుచెందిన వ్యవసాయ భూములు ఏ విధంగా బలవంతంగా గుంజివేయబడి బడా పెట్టుబడిదారీ పరిశ్రమలకు కట్టబెట్టబడ్డాయో వారు గమనించారు. పార్లమెంటు ఆమోదంతో అత్యంత విలువైన దేశ సహజవనరులను అంతర్జాతీయ పెట్టుబడి ఏ విధంగా కబళించిదో వారు చూశారు. ప్రభుత్వ ఆస్తుల అమ్మకాన్ని, పబ్లిక్‌రంగ సంస్థలను పెట్టుబడి ఉపసంహరణ ద్వారా ఏ విధంగా ప్రైవేటీకరించారో వారు చూశారు. అన్ని రంగాల్లోకీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ప్రవేశాన్ని ఏ విధంగా సుగమంచేశారో, వారి లాభార్జనకు ఏ విధంగా తోడ్పడ్డారో వారు చూశారు. అంతేగాక, మనదేశ ప్రయోజనాలను తుంగలో తొక్కి తామే చెప్తున్న 'ఔన్నత్యంగల' పార్లమెంటునూ పరిగణనలోకి తీసుకోకుండా ఏ విధంగా భారత–అమెరికా అణుఒప్పందం చేసుకున్నారో వారికి తెలుసు. ప్రభుత్వ పాలనా వ్యవహారాలన్నీ మార్కెట్ నియంత్రిత విధానాలుగా ఏ విధంగా దిగజారిపోయాయో వారికి తెలుసు. భోపాల్ గ్యాస్ బాధితుల నష్టపరిహారాన్ని ఉపసంహరించుకుంటూ మన 'పవిత్ర' భారత రాజ్యాంగానికి గంటల వ్యవధిలోనే సవరణలు చేశారని కూడా వారికి తెలుసు. పార్లమెంటు, అసెంబ్లీలు వాటి స్థానాల నుండి మరింతగా దిగజారిపోతూ 'బాతాఖానీ క్లబ్బుల' స్థాయినుండి అశ్లీల దృశ్యాలను వీక్షించే క్లబ్బులుగా మారటాన్ని వారు గమనించారు. పార్లమెంటు సభ్యులు తమవేతనాలను, సౌకర్యాలను, ఇతర సదుపాయాలను భారీఎత్తున పెంచుకున్నారనే విషయమూ వారికి తెలుసు. ఈ కారణాలుగా ప్రజలకు ఎన్నికల పట్ల, చట్టసభలపట్ల ఆసక్తి సన్నగిల్లటంతోపాటుగా ఈ కారణాలన్నీ కలగలసి వారి కనులు తెరిపిళ్ళుబడేట్టు చేశాయి. ఈ కారణంగా కోట్లాదిమంది సాధారణ ప్రజానీకం, మేధావులు, విద్యావంతులైనవారు పార్లమెంటరీ వ్యవస్థనుండి, ఎన్నికల క్రమం నుండి తమకుతాము దూరం జరుగుతూ దేశ, లేదా ప్రజల ప్రయోజనాలకు అవి ఏ విధంగానూ మేలు చేకూర్చబోవని క్రమంగా గుర్తిస్తున్నారు.

## అవే...వలసవాద నిర్బంధ చట్టాలు

అధికార మార్పిడి జరిగిన వెనువెంటనే 'స్వతంత్ర' భారత ప్రభుత్వం తెలంగాణాలోకి సాయుధబలగాలను నడిపి విప్లవ కారులను, రైతాంగాన్ని ఉచకోత సాగించటాన్ని ప్రజలు చూశారు. పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్న భారత ప్రభుత్వం 1974లో రైల్వే సమ్మెని ఎంతటి క్రూరంగా అణచివేసిందో ప్రజలు మరిచిపోలేదు. కుట్రకేసులలో ఇరికించటం ద్వారా ప్రతిపక్ష నాయకులను సైతం విచారణలేకుండా జైలుపాలు జేయటానికి భారత ప్రభుత్వం భారత రక్షణ నిబంధనలను ఏ విధంగా ప్రయోగించిందో ప్రజలకు ఈనాటికీ గుర్తువుంది. బ్రిటీషు పాలకులచే జైలులో నిర్బంధించబడిన కా॥ ఏ.కె.గోపాలన్‌ను, అతను మొదటి పార్లమెంట్‌కు సభ్యునిగా ఎన్నికైనప్పటికీ అధికారమార్పిడి తదనంతరం కూడా భారత 'స్వతంత్ర' పాలకులు విడుదల చేయక పోవటం భారత ప్రజానీకాన్ని విస్మయానికి గురిచేసింది. ఆదివాసీ ప్రజానీకం తమ హక్కుల పరిరక్షణ కోసం జరిపే న్యాయమైన పోరాటాలను అణచివేసేందుకు భారత ప్రభుత్వం వలసవాదులచే రూపొందించబడిన కల్లోలిత ప్రాంత చట్టాలను ఏ విధంగా ఉపయోగించిందీ వారు గమనిస్తూవస్తున్నారు. కార్మికులు, శ్రామిక ప్రజానీకం సాగించే చిన్నపాటి నిరసనలను అణచివేయటానికి కూడా అత్యవసర సేవలనిర్వహణా చట్టాన్ని పాలకులు ఏ విధంగా దుర్వినియోగపరుస్తున్నదీ వారు గమనిస్తున్నారు. బ్రిటిష్ వలస పాలకుల నుండి సంక్రమించిన చట్టాల ఆధారంగా సైనిక బలగాల ప్రత్యేకాధికారాల చట్టం (ఎఎఫ్ఎస్‌పిఎ) వంటి క్రూర నిర్బంధ చట్టాలను రూపొందించి పార్లమెంటును లోబరుచుకుని, తమచట్టాలకు ఆమోదముద్ర వేయించుకుంటూ జమ్మూకాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలలో ఈ చట్టాలను అమలు చేయటాన్ని ప్రజలు తమకు తాము గుర్తు చేసుకుంటున్నారు. ఇందిరాగాంధీ విధించిన 'అత్యయిక పరిస్థితి' చీకటిరోజులలో ఆమె అధిపత్య విధానాలకు వ్యతిరేకమైన లేదా భిన్నమైన ఏ చిన్నపాటి నిరసనను కూడా నిర్దాక్షిణ్యంగా అణచివేయటాన్ని వారు వాస్తవికంగా అనుభవించి వున్నారు. కూరగాయలతో సహా మార్కెట్‌లోని నిత్యావసర సరుకుల ధరలన్నింటినీ పెంచివేస్తున్న మధ్య దళారులు, చట్టావ్యాపారులు, చీకటి వ్యాపారస్తులకు వ్యతిరేకంగా ఈ 'అత్యున్నత' పార్లమెంటు ఏనాడూ 'ఎస్మా' చట్టాన్ని ప్రయోగించేందుకు పూనుకోలేదని కూడా ప్రజలకు తెలుసు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన కనీసమద్దతుధర (ఎమ్ఎస్‌పి)ని ఇవ్వటానికి నిరాకరించిన వారిపై; తమ పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు, ఉద్యోగులకు చట్టబద్ధమైన వేతనాలు, సౌకర్యాలు కల్పించ నిరాకరించే యాజమాన్యాలపై– పార్లమెంటు మార్గదర్శకత్వంలో నడిచే ఈ ప్రభుత్వాలు వారికి వ్యతిరేకంగా ఎన్నడూ ఈ ఎస్మాను ప్రయోగించటానికి పూనుకోలేదని కూడా వారికి తెలుసు. ఈ ప్రభుత్వాలు నల్లధనం కలిగివున్నవారిని, దగాకోరులను అణచివేసి శిక్షించేందుకు కలలోకూడా పూనుకోవనే విషయమూ వారెరుగుదురు. దళితులపై అత్యాచారాలకు పాల్పడిన అగ్రకుల పెత్తందారులలో ఒక్కరిపై కూడా, ప్రజలనుండి పెద్దఎత్తున ఆందోళన, వత్తిడి లేకుండా చట్టాల ప్రకారమైనా కనీసంగా కేసులు నమోదుచేయటం కూడా జరగటం లేదనీ వారికి తెలుసు. పార్లమెంటరీ వ్యవస్థలో ఎన్నికైన ప్రభుత్వాల తరఫున పోలీసులు బూటకపుఎదురుకాల్పులలో అమాయకులను నిస్సంకోచంగా హత్యలుగావిస్తున్న విషయమూ వారికి తెలుసు. దోపిడీ పెట్టుబడిదారులకు మద్దతుగా పోలీసు బలగాలు ప్రతిరోజూ కార్మికుల ఆందోళనలను ఏ విధంగా క్రూర అణచివేతకు గురిచేస్తూ వస్తున్నాయో వారు గమనిస్తున్నారు. మహిళలకు కనీసపాటి రక్షణ లేకపోవటాన్ని, భారత రాజధాని ఢిల్లీతో సహా దేశంలోని వివిధ నగరాలలో జనసమ్మర్ద కూడళ్ళలో సైతం మహిళలు పట్టపగలే అత్యాచారాలకు, సామూహిక అత్యాచారాలకు గురవటాన్ని వారు అనునిత్యం గమనిస్తున్నారు. ప్రజలను క్రూరంగా అణచివేసే రాజ్యహింసకు సంబంధించిన ఈ వాస్తవాలన్నీ పెద్దఎత్తున ప్రచారంగావించబడిన, గొప్పగా కీర్తించ బడుతున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపట్ల భ్రమల నుండి ప్రజలను బయటపడేస్తున్నాయి. ఈ కారణంగానే ఈ 60 సం॥ల కాలంగా ప్రజాస్వామ్యం పేరుతో పాలకుల, పాలకవర్గాలచేతిలో తాము మోసగించ బడ్డామనే విషయాన్ని వారు గుర్తిస్తున్నారు. ఒకవేళ ఈ సందర్భాన్ని స్మరించుకోవలిసేవస్తే వంచనకు, మోసకారీతనానికి నిరసనగా చీకటిరోజుగా స్మరించుకోవలసి వుంటుందని వారు భావిస్తున్నారు.

## 'అధికార మార్పిడి' పై ఆనాడే...కమ్యూనిస్టులు

పాలకుల, పాలకవర్గాల ఈ విధమైన వంచనాపూరిత వ్యవహారసరళి మోసకారీతనం, ముందుగా అంచనా కట్టలేని ఆకస్మిక పరిణామ మేమీకాదు. ప్రజలనే అన్ని ప్రభుత్వ విభాగాలకంటే సర్వోన్నతులుగా (పార్లమెంటు కంటే ఉన్నతులుగా ప్రజలను) విశ్వసించే రాజకీయ నాయకత్వం 1947లోనే ఆనాటి 'స్వాతంత్ర్యం' (అధికార మార్పిడి) దాని తదనంతర పరిణామాల యొక్క వర్గస్వభావాన్ని స్పష్టంగా, క్రమబద్ధంగా, వాస్తవికంగా, శాస్త్రీయంగా అంచనావేసి, నిర్ధారించి ప్రకటించింది. వారు ఈ విధంగా స్పష్టంచేశారు :

"బ్రిటిష్ వలస పాలకులు, భారత దేశ స్వాతంత్ర్యం కోసమంటూ రూపొందించిన నూతన రాజ్యాంగ పథకం, 1942లో క్రిప్సు ప్రతిపాదనను పునరుల్లేఖించటం మినహా మరేమీకాదు".

"1946 రాజ్యాంగ పథకం, భారత రాజకీయ జీవితంలోని వివిధ శక్తులను అసమతుల్యంచేసే పాత విధానాన్నే కొనసాగించింది... ప్రత్యేకంగా మతాల ప్రాతిపదికపై ఆధారపడ్డ రాజకీయ శత్రుత్వ పరిస్థితిని పెంపొందించటం...అంతిమంగా దీని నియంత్రణను వారి (బ్రిటీష్ వారి) చేతులలో వుంచటం"

"భారత స్వాతంత్ర్యం' ప్రకటన వెనుక, అది (బ్రిటిష్) తన పైచేయిని కొనసాగించటంతో పాటుగా తన అత్యవసర ఆర్థిక వ్యూహాత్మక ఆధిపత్యాన్ని కొనసాగించాటాన్ని కోరుకుంది."

"తాము ఏ విధమైన ప్రభుత్వపు పాలనలో జీవించాలనుకుంటున్నారో స్వేచ్ఛగా నిర్ణయించుకునే అవకాశం భారత ప్రజలకు లభించే అవకాశమేలేదు"

"అబద్ధపు స్వాతంత్ర్యాన్నివ్వటమే బ్రిటిష్ విధానం. మరోమాటల్లో చెప్పాలంటే తాము కొనసాగేందుకే నిష్క్రమించటం".

"మౌంట్ బాటన్ పథకం భారత బడాబూర్జువావర్గం మరియు సామ్రాజ్యవాదుల మిత్రత్వపు సూత్రాన్ని ముందుకు తీసుకువచ్చింది".

"నూతన ప్రభుత్వ (భారత స్వతంత్ర ప్రభుత్వం) 'విశిష్ట' స్వభావమేమంటే, గతకాలపు సామ్రాజ్యవాద పాలన కొనసాగింపే. గత సామ్రాజ్యవాద పాలకుల యొక్క అదే ఉన్నతాధికార యంత్రాంగం, అదే న్యాయ, పోలీసు వ్యవస్థలతో సహా మొత్తంగా సామ్రాజ్యవాద పరిపాలనా యంత్రాంగమంతా యాధాతథంగా స్వీకరించబడి, కొనసాగింపబడుతున్నది. ఆనాటి వలసవాదుల అవే నిర్బంధ విధానాలు, నిరాయుధులైన ప్రజలపై అదేతరహా పోలీసు కాల్పులు, లాఠీఛార్జీలు, సభలపై నిషేధాజ్ఞలు, వార్తాపత్రికల గొంతునులమటం, కార్మిక యూనియన్ల రైతుసంఘాల సభ్యులను, నాయకులను, వేలాదిమంది వామపక్ష ఖైదీలను జైళ్ళలోకుక్కి ఆరోపణ, విచారణలేమీ లేకుండా నిర్బంధించటాలను కొనసాగిస్తున్నది. భారతదేశంలో సామ్రాజ్యవాదుల ఆర్థిక ప్రయోజనాలు, వారి విస్తృతమైన ఆస్తులు, పెట్టుబడులు సంపూర్ణంగా పరిరక్షింపబడటంతో పాటుగా సామ్రాజ్యవాద దోపిడీ ప్రవాహం కొనసాగుతుంది".

"నూతన ప్రభుత్వ నాయకత్వ పొందికలోని శక్తులలో ద్వితీయ ప్రాధాన్యతగల బేధాభిప్రాయాలు, వ్యక్తిగత ఉద్వేగపూరితమైన తేడాలు, ఒకనిర్దిష్ట విధాన వివరాలపై రాజకీయ నేపథ్యం కారణంగా తలెత్తే విబేధాలు వుండే అవకాశముంది. విస్తృత ప్రజా ఉద్యమానికి విరుద్ధంగా సామ్రాజ్యవాదపు కూటమిలో జూనియర్ భాగస్వామిగా వుండే భారతబడా పెట్టుబడిదారీపాలనా ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే ఈ నూతన పాలన యొక్క మౌలిక వర్గ స్వభావాన్ని ప్రభావితం చేసేవిగా ఈ ద్వితీయశ్రేణీ విబేధాలు వుండబోవు"

**(రజనీపామీదత్ 'ఇండియాటుడే' నుండి)**

మన దేశ ప్రజల ఈ 60 సంవత్సరాల అనుభవం పైఅంచనాలతో ఖచ్చితంగా సరిపోలి వుండటంతో పాటుగా వాటిని రుజువుచేస్తూ,

ఆనాటి అంచనా సరైనదేననీ, ఈనాటికీ అది మరింత వర్తించేదిగా వుందనీ తెలియపరుస్తోంది.

## కమ్యూనిస్టు విప్లవకారుల శాస్త్రీయ అంచనా

ఈ సందర్భంలో–ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు విప్లవకారులు తమపై ప్రభుత్వం బనాయించిన, చారిత్రాత్మక కుట్రకేసులో తమవాదనలను వినిపించే క్రమంలో హైదరాబాద్ అడిషనల్ సెషన్స్ జడ్జి కోర్టులో వెలువరించిన వారి ప్రకటనను గుర్తుచేసుకోవటం సమంజసంగా వుంటుంది.

" 'అధికార మార్పిడి' వెనువెంబడి ఏర్పరచిన రాజ్యాంగ వ్యవస్థ బ్రిటిష్ సామ్రాజ్యవాదుల మార్గదర్శకత్వంలో వారి మౌలిక సూత్రాలకనుగుణంగా రూపొందింపబడినదేతప్ప, వారికి వ్యతిరేకమైనది కాదు"

"బ్రిటీష్‌వారి ప్రతిపాదనలను, వర్గీకరణలను మనం పరిశీలించినట్లైతే రాజ్యాంగసభ పూర్తి అధికారాలున్నసభ కాదని, బ్రిటిష్ సామ్రాజ్య వాదుల, భారత ఫ్యూడల్ వర్గాల ప్రయోజనాలకు పూర్తిగా లోబడిన రాజ్యాంగాన్ని రూపొందించటమే దాని ప్రధాన ప్రయోజనంగా స్పష్టమౌతుంది"

"రాజ్యాంగ తయారీకి 4 సం॥ల కాలం పట్టింది. నూతన ప్రభుత్వం అదే బ్రిటిష్ పాలనా, న్యాయ వ్యవస్థలను; సైన్యం, సైనిక బలగాలను యధాతథంగా స్వీకరించింది"

"వయోజన ఓటింగ్‌కు అవకాశం వున్నదన్నప్పటికీ; పార్లమెంటు, అసెంబ్లీలను రాజ్యాంగం ప్రకారం ప్రజలే ఎన్నుకుంటారన్నప్పటికీ భారతదేశంలోని ఆర్థిక వ్యవస్థ స్వభావం, నిరంకుశ ఉన్నతాధికార పాలనాయంత్రాంగాల కారణంగా ఇవేవీ ప్రజలకు ఆచరణలో ఉపయోగపడవు"

"రాజ్యాంగంచే గ్యారంటీ చేయబడిన స్వాతంత్ర్యాలని చెప్పబడేవానిని–ఈనాటిదోపిడి వ్యవస్థను పరిరక్షిస్తున్నవారు, పాలక వర్గాలకు మద్దతుగా నిలచేవారు మాత్రమే అనుభవించగలుగుతున్నారు. ప్రస్తుత పార్లమెంటరీ పార్టీలు, పార్లమెంటు వెలుపల పనిచేసే వీరి వివిధ అనుబంధ సంస్థలూ ఈ కోవకు చెందుతాయి"

" 'అధికారమార్పిడి' మరుక్షణం నుండీ పి.డి. చట్టం అమలులోకొచ్చింది. 'అంతర్గత భద్రతా చట్టం' రూపంలో ఇది అమలులోకొచ్చింది. దీనికి మించిన మరెన్నో క్రూర నిర్బంధ చట్టాలు వివిధ రాష్ట్రాలలో అమలులో వున్నాయి. రాజ్యాంగాన్ని, దేశసమగ్రతను పరిరక్షించుకోవటం పేరిట మరిన్ని క్రూర నిర్బంధాలను రూపొందించేందుకు రాష్ట్రాలకు అధికారాలిచ్చారు. పి.డి. చట్టం మరియు ఈ విధమైన క్రూర చట్టాలన్నీ బ్రిటీష్ సామ్రాజ్యవాదులు అమలు చేసినవేననే విషయాన్ని మనం మరువరాదు"

"ముందస్తుగా నిర్బంధంలోకి తీసుకునే ఈ చట్టాలన్నీ రాజ్యాంగంలో పేర్కొన్న స్వాతంత్ర్యాలన్నిటినీ కాలరాచి వేసేవే! ఈ అధికారాలతో పాలకవర్గాలు, ఈ వ్యవస్థను కూలదోయాలనుకునే విప్లవకారులనే గాకుండా, ప్రజలను వారి న్యాయమైన డిమాండ్లపై ఐక్యంచేసి ఉద్యమింపజేసే వారినందరినీ విచారణకూడా లేకుండా నిర్బంధిస్తున్నాయి".

"అత్యవసరసేవల నిర్వహణా చట్టం (ఎస్మా) అమలు చేస్తున్నారు. ఈ చట్టాన్ని ఉపయోగించి ప్రజల సమ్మెలు, ఆందోళనలను నిషేధిస్తున్నారు. ఈ నిషేధించబడిన సమ్మెలు, ఆందోళనలు ఇంకా కొనసాగితే, పోలీసు రాజ్యం నగ్నంగా నర్తిస్తుందని ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు"

"భారత జాతీయోద్యమాన్ని అణచివేయటానికి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ప్రవేశపెట్టి, అమలు చేసిన ఐపిసిలోని 120(బి),121,122,123,124 సెక్షన్ల వంటివన్నీ ఈనాటికీ అమలవుతున్నాయి. ఈ సెక్షన్ల ప్రకారం ఎవరినైనా కుట్రకేసులలో ఇరికించి ఖైదు చేయవచ్చు"

"ఈ విధంగా రాజ్యాంగం ప్రసాదించిందని చెప్పబడే ఈ స్వేచ్ఛలు, స్వాతంత్ర్యంవంటి వాటి వన్నీ వెనక్కు గుంజేసుకున్నాయి. వీటిని లాగివేసుకోవటానికి పాలక వర్గాలకు ఈ రాజ్యాంగం పూర్తి అధికారాలనిచ్చింది."

"ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిందని చెప్పబడే స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను, ప్రభుత్వాలకున్న అధికారాలతో పోల్చితే, ప్రజలకు పోరాటం–అదీ విప్లవ పోరాటం– మినహా మరో మార్గం లేదు"

"కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి స్వీయరాజకీయ ప్రయోజనాలకనుగుణంగా ఈ చట్టాలను దుర్వినియోగ పరుస్తున్నాయి"

"రాజ్యాంగ వ్యవస్థలో న్యాయస్థానాలు అంతర్భాగమైనప్పటికీ ఈ చట్టాల దుర్వినియోగానికి, అతిక్రమణలకు అవి కూడా మద్దతునీయలేనంతగా ప్రభుత్వాల చట్టరహిత పాలన సాగుతున్నది"

"ప్రభుత్వాన్ని వ్యతిరేకించే ప్రజలు, రాజకీయ నాయకులు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వం యొక్క దయాదాక్షిణ్యాలపై ఆధారపడి జీవించే పరిస్థితికి నెట్టబడ్డారు"

"ఆస్తిహక్కును ప్రాథమికహక్కుగా గుర్తించటం ద్వారా రాజ్యాంగం, సామ్రాజ్యవాదులకు, బడా బూర్జువాలకు, ఫ్యూడల్‌వర్గాలకు రక్షణకల్పిస్తూ, ప్రజలకు బదులుగా ఆ వర్గాల ప్రయోజనాల పరిరక్షణకు హామీనిస్తున్నది"

"ప్రజలకు ఆదేశిక సూత్రాలు రాజ్యాంగపర హక్కులు కావని, వాటి అమలుపై న్యాయస్థానాల ద్వారా ప్రశ్నించే హక్కు వారికి లేదని రాజ్యాంగమే వివరణనిచ్చింది"

→

# కేరళ మత్స్యకారుల హత్య

# ఇటాలియన్ హంతకులకు మేలు చేకూర్చేందుకు మనదేశ చట్టాన్ని వీగిపోయేట్లు చేస్తున్న పాలకులు

**మన** పాలకులు, పాలకవర్గ మేధావులు–మనదేశ చట్టాల, న్యాయస్థానాల అనుల్లంఘనీయ పవిత్రత గురించి చాలా తరచుగా బోధనలు చేస్తుంటారు. ఈ విధమైన బూటకపు ప్రకటలతో దోపిడీ పాలకులు, పాలకవర్గాలు - వారి ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెల్లుబికే ప్రజల ప్రతిఘటనను సాధ్యమైనంత వరకూ నీరుగార్చి తమ దోపిడీ, అణచివేత పాలనను కొనసాగిస్తూవస్తున్నారు.

కానీ, ఈ పాలకవర్గాలు, పాలకులు ఎప్పుడైతే తమ వర్గప్రయోజనాలు, వ్యక్తిగత ప్రయోజనాలకు భంగం కలుగుతుందనుకుంటాయో అప్పుడు వారు నిస్సంకోచంగా ఏ విధమైన తటపటాయింపులూ లేకుండా 'పవిత్ర' న్యాయస్థానాల్ని–మన దేశచట్టాల్నీ, అవసరమైతే మనదేశ సార్వభౌమత్వాన్నీ కూడా పణంగా పెట్టి - ఉల్లంఘనలకు పాల్పడతారు.

గత 25 సంవత్సరాలుగా, బోఫోర్సు కుంభకోణంలో నేరస్థుడైన–రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీల స్నేహితుడైన–ఖత్రోచీని, మనదేశంలో కానీ స్వీడన్‌లోకానీ అతనిపై తగిన న్యాయ విచారణ చేపట్టకుండా అరెస్టు చేయకుండా వదిలివేస్తున్న మన పాలకుల సిగ్గుమాలిన చర్యను తీవ్రంగా ప్రజలు నిరసిస్తున్నారు. ఆనాటి స్వీడిష్ విచారణకు బాధ్యుడైన అధికారి ఇటీవల పదేపదే వెల్లడి చేస్తున్న దాని ప్రకారం - రాజీవ్‌గాంధీ ప్రభుత్వమే ఖత్రోచీపై తగిన దర్యాప్తు చేయకుండా, అతను శిక్ష నుండి తప్పుకునేందుకు మార్గాన్ని సులభం చేసింది. నీతిమాలిన ఈ చర్యపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమౌతూ ప్రజాఅభిశంసనకు గురైన ఇలాంటి పరిస్థితుల్లో కూడా ప్రస్తుత పాలకులు, మరోసారి మనదేశ చట్టాలనుండి తప్పుకునేందుకు ఇద్దరు ఇటాలియన్ హంతకులకు సహకరించారు. ఇటాలియన్ హంతకుల స్వార్ధ ప్రయోజనాలకు వీరు లోబడి వ్యవహరించటంతో పాటు, మనదేశ చట్టాలు వీగిపోయేట్లుగా చేయటానికి సహకరించారు. అంతేగాకుండా ఇటలీ ప్రభుత్వానికనుగుణంగా మనదేశ సార్వభౌమత్వాన్ని పణంగా పెట్టారు. కాగా, యుపిఏ ప్రభుత్వ అధినేత్రి సోనియాగాంధీ ఇటలీకి చెందినవారు కావటం వలన, ఇటాలియన్ నేరస్థులు ఏ విధమైన శిక్షకు గురికాకుండా భారత చట్టాలు, న్యాయవ్యవస్థ నుండి కాపాడ బడుతున్నారనేది నిరాకరించ వీలులేని తార్కిక వక్కాణింపు మాత్రమే!

2012 ఫిబ్రవరి 15వ తేదీన కేరళ కొల్లమ్‌తీరానికి చెందిన వాలెంటైన్ ఎప్లాస్టెయిన్, ఆజేష్‌నింకి అనే ఇరువురు మత్స్యకారులను 'ఎన్రికాహెక్సీ' అనే ఇటాలియన్ వాణిజ్యనౌకపైనుండి భారత తీరప్రాంత దేశీయ జలాలహద్దులలోనే వారి నావికులు కాల్పులు జరిపి హత్యగావించారు. కావున ఆ ఇటాలియన్ నావికులిరువురూ హత్యానేరం క్రింద మనదేశ చట్టాల ప్రకారం విచారణనెదుర్కోని శిక్షింపబడవలసివుంది.

కానీ, ఈ హంతకులకున్న ఇటలీ బాంధవ్యాన్ని దృష్టిలో వుంచుకున్న మన అధికారులు, వారిపై మనదేశ చట్టప్రకారం న్యాయవిచారణ జరిపి, శిక్షించేందుకు విముఖత చూపారు.

ఈ ఘోరమైన హత్య సంఘటన వెనువెంటనే, ఇటలీ ప్రభుత్వం రంగంలోకి దిగి తమ దేశానికి చెందిన హంతకులపై ఏ విధమైన చర్యలూ తీసుకోకుండా విడిచిపెట్టాలని భారత ప్రభుత్వంపై దౌత్యపరమైన వత్తిడి తీసుకువచ్చింది. మరోవైపున రోమన్ క్యాథలిక్ చర్చికూడా నూతనంగా నియమించబడిన క్యాండినల్ జార్జి అలాంఛెరి ద్వారా హంతకులైన ఇటాలియన్ నావికులను వదిలివేయమని కేరళ ప్రభుత్వంలోని క్యాథలిక్ మంత్రులను సంప్రదించింది.

మరోవైపున కేరళ రాష్ట్ర పోలీసులు, ఇటాలియన్ హంతకులను చిన్న పిల్లల తరహాలో వారికి చక్కటి సంరక్షణ ఏర్పాటు చేశారు. మత్స్యకారులు హత్యగావింపబడిన నాలుగు రోజుల వరకూ ఇటాలియన్ హంతకుల నిర్ధారణను వెల్లడించేందుకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులను అనుమతించలేదు. కానీ కేరళ రాష్ట్ర ప్రజల, మత్స్యకారుల నిరసన, ఆందోళనల తర్వాతనే అర్ధమనస్కంగానైనా కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఇటాలియన్ నావికులైన హంతకులపై న్యాయవిచారణ జరిపేందుకు సిద్ధమైంది.

ఇటాలియన్ నావికుల అరెస్టు వెనువెంటనే ఆదేశ మంత్రి స్టాఫెన్ జిమిసురా భారతదేశానికి హుటాహుటిన వచ్చి, అరెస్టు చేయబడిన హంతకులను కలుసుకున్నాడు. ఇటాలియన్ హంతకుల అరెస్టు తనకు ఆమోదయోగ్యంగా లేదనీ, మరోమాటల్లో భారత దేశీయ జలాల్లో అమాయక భారత మత్స్యకారులను చంపేయటాన్ని సమర్ధించుకుంటూ ఇటలీ ప్రధాని మన దేశ ప్రధానితో ఫోన్‌లో సంభాషించాడు. ప్రభుత్వాన్ని నడిపించే పార్టీ అధినేత్రి ఇటలీ దేశస్థురాలు కావటంతో కూడా, ఇటలీ ప్రభుత్వపు అహంకారం ఈ విధంగా వుంది.

ఇద్దరు భారత మత్స్యకారులను హత్యగావించిన తమ దేశ నావికాధికారులపై మోపిన కేసులను కొట్టివేయాలనే తమ వాదనలను ఇటలీ ప్రభుత్వం తరఫు న్యాయవాదులు సంబంధిత న్యాయస్థానాల్లో వినిపించారు. తమ ముద్దాయిలపై ఆరోపించబడిన నేరం విషయంలో కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి ఈ విధమైన క్రిమినల్ కేసు బనాయించే అధికారం లేదని, ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో రూపొందించుకున్న ఒప్పందంపై సంతకం చేసిన భారతదేశంకూడా ఈ కేసును అంతర్జాతీయ చట్టం మరియు ఆ ఒప్పందం ప్రకారం విచారించవలసి వుంటుందని వారు తమ వాదనల్లో గట్టిగా నొక్కిచెప్పారు. భారత తీరం నుండి 12 నాటికల్ మైళ్ళ దూరంలోపునే మత్స్యకారుల హత్య సంఘటన జరిగిందనే విషయాన్ని వారు నిరాకరించారు. భారత తీరానికి 12 కిలోమీటర్ల ఆవలనున్న సముద్ర జలాలలో ఈ సంఘటన జరిగిందనీ, ఇది, ఇటాలియన్ నావికాబలగాల అధికారులు తమ విధుల నిర్వహణలో భాగంగా తీసుకున్న చర్య కావున, ఇటలీదేశ ప్రభుత్వం దీనికి సంబంధించి పూర్తి బాధ్యత వహిస్తుందని చెప్పారు. మరణించిన మత్స్యకారులను 'సముద్రదొంగలు'గా ముద్రవేస్తూ అంతర్జాతీయ జలాలలోని తమ నౌకపై వారు దాడికి పాల్పడిన తర్వాత కూడా, పదేపదే హెచ్చరికల అనంతరం, బైనాక్యులర్స్ ద్వారా వారిని సాయుధ సముద్రదొంగలుగా నిర్ధారించుకున్న తర్వాతనే ఇటాలియన్ నౌకాబలగాలు హెచ్చరికగా కాల్పులు సాగించాయంటూ ఇటలీ ప్రభుత్వం తమ దేశ హంతకులను మనదేశ చట్టాలనుండి కాపాడటానికి ఓ కట్టుకథను సృష్టించి అడ్డగోలు వాదనలు సాగించింది.

ఏదిఏమైనా, భారత జలాలలోనే ఈ సంఘటన చోటుచేసుకున్నదనేది వాస్తవం. కొచ్చిన్ పోర్టుట్రస్టు ఈ వాస్తవాన్ని నిర్ధారించింది కూడా. తొమ్మిదిమంది మత్స్యకారులు పడవలో నిద్రిస్తుండగా, ఇద్దరు మాత్రమే మెలకువగా వున్నారు. హెచ్చరికల వంటివేమీ లేకుండానే ఈ ఇద్దరూ కాల్చి చంపబడ్డారు.

హత్యకు గురైన మత్స్యకారుల కుటుంబాలు లేదా వారితరఫు బంధువులకు భారీస్థాయి మొత్తాలను నష్టపరిహారంగా చెల్లించటం ద్వారా న్యాయస్థానాల వెలుపలే ఒక ఒప్పందం చేసుకునే ప్రయత్నాన్ని ఇటలీ ప్రభుత్వం చేసింది. హత్యకు గురైన మత్స్యకారుల కుటుంబాలకు –ఇటలీ ప్రభుత్వానికి నడుమ ఈ చట్ట విరుద్ధ రాజీని కేరళ ప్రభుత్వం ప్రశ్నించకుండానే అనుమతించింది. కానీ సముద్రయాన సంబంధ కేసులను విచారించే అధికారం లేని 'లోక్ అదాలత్' ఎదుట రాజీ ఒప్పందాన్ని అధికారికంగా అనుమతించింది. ఈ విధంగా నౌకా మంత్రిత్వశాఖ, కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఇటలీ ప్రభుత్వానికి సహకరించటం ద్వారా సుప్రీంకోర్టు సరిగ్గా ఎత్తి చూపిన విధంగా భారత న్యాయవ్యవస్థను ఓటమికి గురిచేసేందుకు భారతదేశ చట్ట అమలు క్రమంతో ఆటలాడుకున్నారు.

కథ ఇంతటితో ముగియలేదు కూడా! ఆశ్చర్యకరంగా భారత ప్రభుత్వం తరఫున ఈ కేసులో వాదిస్తున్న అడిషనల్ సొలిసిటర్ జనరల్ హరీన్ రావల్ ఇటలీ ప్రభుత్వ వాదనలకు సమర్ధనగా తన వాదనలను వినిపించాడు. అతను ఇటలీ ప్రభుత్వానికి, మత్యకారులను హత్యగావించిన ఇటలీ నావికాధికారులకు న్యాయవాదిలా వ్యవహరించాడు. మత్స్యకారుల హత్య సంఘటన భారత దేశీయ జలాల పరిధిలో జరగలేదని, అంతర్జాతీయ జలాల పరిధిలో జరిగిందని అతను కరాఖండిగా చెప్పాడు. ఈ విధంగా, భారతప్రజలు సిగ్గుతో తలదించుకునే విధంగా అతను, హంతకులైన ఇటలీ నావికులను ఈ నేరం నుండి తప్పించేందుకు ఉద్దేశ్యపూర్వకంగా పూనుకున్నాడు. న్యాయస్థానం ఇతని వాదనలలోని లోపాల్ని గమనించి, అతని వాదనల ఉద్దేశ్యాన్ని కోరగా, అది 'ప్రభుత్వ నిర్ణయం'గా అతను నిర్ధారించి, నొక్కిచెప్పాడు. ఏమైనా, తీవ్ర విమర్శలకు గురైన తర్వాత మధ్యాహ్నానికి అతను మాటమార్చి తాను ఉదయం సుప్రిం కోర్టులో చేసిన వాదనంతా తన స్వీయ అభిప్రాయం మాత్రమేనని, ప్రభుత్వానికి దీనితో సంబంధంలేదని పేర్కొన్నాడు. ఈ విధంగా ఇటలీ హంతకులకు విరుద్ధంగా జరుగుతున్న కేసులో మత్స్యకారులకు న్యాయం జరగకుండా వుండేందుకు సాధ్యమైనంత నష్టాన్ని అతను కల్గించాడు. అతని ఈ కొత్త ప్రకటన ద్వారా అధినాయకులందరినీ (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను) ఈ విశ్వాస ఘాతుకత్వం నుండి విముక్తి చేసేందుకు ప్రయత్నించాడు. అది వాస్తవానికి అతని అభిప్రాయమే అయినట్లయితే కూడా, తుచ్ఛమైన ఈ విశ్వాస ఘాతుకత్వానికి అతను విచారణను ఎదుర్కోవలసి వుంటుంది. కానీ, ఈ విధమైన ప్రయత్నాలు ఏవీ మన ప్రభుత్వాల నుండి లేకపోవటమనేదే, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇటలీ హంతకులను కాపాడ నిశ్చయించుకొని, మనదేశ సార్వభౌమత్వాన్ని పణంగాపెట్టి, నిస్సిగ్గుగా కేంద్ర ప్రభుత్వం – కేరళ రాష్ట్ర ప్రభుత్వాలు మనదేశ చట్టాల ఓటమికి వారితో సహకరించాయనటానికి తిరుగులేని రుజువు!

ఇవీ మనదేశంలోని 'అనుల్లంఘనీయమైన' న్యాయవ్యవస్థపట్ల, 'పవిత్ర' చట్టాలపట్ల మనపాలకులు, పాలక వర్గాలు ప్రదర్శించే మర్యాదా, మన్ననలు!

రాజ్య సంస్థల గురించి ఉద్వేగపూరిత, పెద్దపెద్ద పదాలు వల్లెవేయటం ద్వారా ప్రజలను అణచివుంచి దోపిడీ సాగించుకోవటం, అంతులేని వారి అధికార తాపత్రయం మినహా మన పాలకులకు, పాలకవర్గాలకు 'అనుల్లంఘనీయం' 'పవిత్రం' అనేవేవీ లేవని ఈ సంఘటన రుజువు చేస్తున్నది. ✡

# జాతి పేరుతో ఈశాన్య ప్రాంత ప్రజలపై సాగుతున్న వ్యవస్థీకృత వివక్ష

**మణిపూర్,** మేఘాలయ, మిజోరామ్, నాగాలాండ్ వంటి ఈశాన్య రాష్ట్రాలు మనదేశ అంతర్భాగాలుగా చెప్పబడుతున్నప్పటికీ, భారత ప్రధాన భూభాగంగా పిలవబడే దానిలోని ప్రభుత్వ అధికారులు, ప్రజలు మాత్రం వారిని 'విదేశీయులు'గా పరిగణిస్తున్నారు.

'హిందూ'సంస్కృతికి వారి సంస్కృతికి వున్న తేడాలు; 'హిందూ' ఆచారాలకు వారి ఆచారాలకు నడుమనున్న తేడాలే–భారత ప్రధాన భూభాగంలోని వారు ఈశాన్య రాష్ట్రాలవారిని వివక్షకు గురిచేయటానికి కారణాలుగా వున్నాయి. మరో మాటల్లో చెప్పాలంటే ఇది జాతివాదపు దురభిమానం.

భారతదేశంలోని ప్రధాన నగరాలలో ఈశాన్య రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు మొరటు వ్యాఖ్యల రూపంలో, వారి జీవన విధానాన్ని కించపరిచి తేలికచేసే వ్యాఖ్యానాలరూపంలో జాతి వివక్షను ఎదుర్కొంటున్నారు. చాలా తరచుగా ఈ రాష్ట్రాలకు చెందిన మహిళలు జాతి వివక్షలో భాగంగా లైంగిక వేధింపులకు గురవుతున్నారు.

గతకొద్ది రోజులలో ఈశాన్య రాష్ట్రాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అసహజ మరణాలకు గురయ్యారు.

గురుగావ్‌లోని ఒక ఎం.బి.ఏ. చదువుకుంటున్న మేఘాలయ విద్యార్థిని దానా సంగ్మా తమ కళాశాల మోసకారితనానికి తాను ఆరోపణలెదుర్కోవటంతో కలతచెంది ఆత్మహత్యకు పాల్పడింది. తనపైసాగిన వివక్షకు ఆమె తన జీవితాన్నే మూల్యంగా చెల్లించింది. కళాశాల యాజమాన్యము, పోలీసులు ఆమె మరణాన్ని గురించి దర్యాప్తు చేయటంలో ఘోర నిర్లక్ష్యంగా వున్నారు. విద్యార్థుల నిరసనల తర్వాత, పార్లమెంట్‌లో ప్రస్తావించబడిన తర్వాత మాత్రమే యస్.సి., యస్.టి., అత్యాచార నిరోధక చట్టం ప్రకారం కనీసం కేసు అయినా నమోదు చేశారు.

రిచర్డ్ లతమ్–మణిపూర్ నుండి వచ్చి ఆర్కిటెక్చర్ కోర్సు చదివే విద్యార్థి. ఇతను బెంగుళూరులోని తన హాస్టల్ రూమ్‌లో తలకు తగిలిన బలమైన గాయాలతో చనిపోయాడు. ఇతను నివసించే హాస్టల్‌లోని సహవిద్యార్థులిద్దరు చావబాదటం కారణంగానే ఇతను చనిపోయాడు. కానీ, బెంగుళూరులోని ఎన్ఆర్‌వి స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కళాశాల యాజమాన్యం మాత్రం రిచర్డ్ మాదకద్రవ్యాల వ్యసనపరునిగా పేర్కొంది. మరోవైపున, రిచర్డ్ రోడ్డు ప్రమాదంలో తగిలిన గాయల ఫలితంగా చనిపోయాడంటూ అసహజ మరణంగా పోలీసులు నమోదు చేసుకున్నారు.

ఏమైనా, శవపరీక్షా నివేదికలో అతను మాదకద్రవ్య వ్యసనపరుడు అనటానికి రుజువు దొరకలేదు. రిచర్డ్ చనిపోయిన రోజు రాత్రి అతనిని ఇద్దరు వ్యక్తులు కొట్టారని పోలీసులకు, హాస్టల్ వార్డెన్‌కు ఇచ్చిన వాంగ్మూలాలతో ముగ్గురు విద్యార్థులు తెలియపరిచారు. రిచర్డ్ హాస్టల్‌లోనే చనిపోయాడని డాక్టర్ నమోదు చేశాడు. కానీ యాజమాన్యం పోలీసులతో కుమ్మక్కై, రిచర్డ్ మృతదేహాన్ని హాస్టల్ నుండి ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి, ఒక రోడ్డు ప్రమాదంలో అతను గాయపడి చనిపోయినట్లుగా నమోదు చేయించారు.

ఈ విధంగా పై రెండు సంఘటనలలోనూ యాజమాన్యం, అదేవిధంగా సంబంధిత పోలీసు అధికారులు, ఈశాన్య రాష్ట్రాల ఈ విద్యార్థుల మరణాల పట్ల ఘోరమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారనేది స్పష్టమౌతున్నది. ఈ బండబారిన తనం ఈశాన్య రాష్ట్రాల ప్రజానీకానికి వ్యతిరేకంగా ప్రదర్శితమయ్యే నిఖార్సయిన జాతి దురభిమానం తప్ప వేరుకాదు.

ఈశాన్య రాష్ట్ర విద్యార్థులు నిరసన ధర్నాలను నిర్వహించిన తర్వాత మాత్రమే, జాతిపేరిట ఈ వ్యవస్థీకృత వివక్ష వెల్లడైయింది. సాయుధ మిలిటెంటు గ్రూపులు, విభజనవాద గ్రూపులు పనిచేస్తున్న ఈశాన్యరాష్ట్రాల నుండి వచ్చిన విద్యార్థులు ఏదో ఒక వంకతో తమపుట్టుక కారణంగా ఇతర రాష్ట్రాల పోలీసుల వేధింపులకు నిత్యం గురౌతున్నారు. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం నుండి వచ్చిన విద్యార్థులు కూడా ఇదే విధమైన 'ఆదరణ'నే చూరగొంటున్నారు. పోలీసుల వేధింపుల కారణంగా ఇతర రాష్ట్రాలనుండి వచ్చిన వీరికి తరచుగా అద్దెకు గదులు లభించటమనేది కూడా చాలా దుర్లభమౌతున్నది.

ఈ విధంగా అధికారవర్గాలు ఈశాన్య రాష్ట్రాల ప్రజల పట్ల సాంస్కృతిక అసహనాన్ని, జాతి వివక్షను పెంచి పోషిస్తున్నారు.

ఇదే రకపు విభజించి పాలించే విధానంతో బ్రిటిష్ పాలకులు మనలను పరిపాలించారు. ప్రస్తుత 'స్వతంత్ర' భారత పాలకులు కూడా ప్రజావ్యతిరేక విధానాలను సాగిస్తూ అదే విధమైన దోపిడీ అణచివేతలతో కూడిన తమపాలనను కొనసాగించేందుకు దేశ వ్యాపితంగా భారత ప్రజల ఐక్యతను ఈ విధమైన జాతి వివక్ష భావాలు ప్రేరేపించి భగ్నంచేస్తున్నారు. ప్రజలలోని అభ్యుదయకాముక శక్తులు ఈ వ్యవస్థీకృత జాతి వివక్ష విధానాలను, చర్యలను ఖండిచటం మాత్రమే కాక, ఈశాన్య రాష్ట్రాల ప్రజలపై, దేశంలోని ఇతర ప్రాంతాల ప్రజానీకానికి ఏర్పడిన జాతి దురంహంకార భావనలను తొలగించేందుకు వారితో మైత్రిని పెంపొందించుకునేందుకు కృషిచేయాలి. ✡

కాంతి కేంద్రాలా!
మృత్యు మందిరాలా ?
పరమాణు విద్యుత్ శక్తి గురించిన శాస్త్ర, సాంకేతిక, జీవావరణ, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ
ఓ. పి. డి. ఆర్. అధ్యయన బృందం నివేదిక
వెల: రు. 15/-
మైత్రి బుక్ హౌస్
28-9-1, జలీల్‌వీధి, ఏలూరురోడ్, విజయవాడ

జనశక్తి ప్రచురణ
ఆంధ్రప్రదేశ్ విభజన
కమ్యూనిస్టు విప్లవకారుల వైఖరి
కామ్రేడ్స్ తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, విశ్వం తదితరుల
వ్యాస సంకలనం
వెల: రు. 15/-
కాపీలకు: మైత్రీ బుక్ హౌస్
జలీల్ వీధి, అరండల్‌పేట, విజయవాడ

# ఏఎఫ్ఎస్‌పిఏపై సుప్రీంకోర్టు తీర్పు

# వెల్లడైన ఉన్నతన్యాయస్థాన డొల్లతనం

**బ్రిటిష్** వలస పాలకుల నుండి భారత పాలకులకు అధికార మార్పిడి జరిగిన తర్వాత, మన స్వతంత్ర దేశంలో, మన పాలకులచే పాలింపబడుతున్నామని, చట్టం ముందు అందరూ సమానులేననీ, చట్టాతీత వ్యక్తులెవరూ వుండబోరని మనదేశ ప్రజలు నమ్ముతూ వచ్చారు. అదే విధంగా మన న్యాయవ్యవస్థ ప్రజలందరినీ సమదృష్టితో చూస్తూ వారివారి హోదా, మతం, తెగ, లింగం తదితరాలతో నిమిత్తం లేకుండా, ఏ విధమైన వివక్షా చూపకుండా న్యాయం ప్రసాదిస్తుందనీ భావించారు.

అయితే, మన పాలకులు చేసిన ఘనమైన ప్రకటనలు, వక్కాణింపులన్నీ పచ్చి అబద్ధాలు మినహా మరేమీ కావని; పాలకులను ప్రజలు ఏ విధంగానూ అనుమానించకుండా వుండేందుకు, తమ ప్రజా వ్యతిరేక దోపిడీ–అణచివేత పాలనను కొనసాగించేందుకు ప్రజలను భ్రమలో ముంచేందుకేననీ గత 63 సం॥ల ప్రజల చేదు అనుభవాలు రుజువుచేస్తున్నాయి.

12 సంవత్సరాల క్రితం, 2000 మార్చి నెలలో–జమ్ముకాశ్మీర్ రాష్ట్రం, అనంతనాగ్ జిల్లా, ఛత్తిసింగ్‌పొరాలో 35 మంది శిక్కు ప్రజలు టెర్రరిస్టుల చేతుల్లో హత్యకు గురయ్యారు. ఈ కారణాన్ని చూపుతూ 7 రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన సైనికులు, అనంతనాగ్ పరిసర ప్రాంతాలనుండి అక్కడొకరు. ఇక్కడొకరు చొప్పున ఐదుగురు అమాయక కాశ్మీరీలను పట్టుకొని నిర్బంధించి, వారిని సుదూర ప్రాంతాలకు తీసుకెళ్ళి నిలువునా హత్యగావించారు. ఆనాటి అమెరికా దేశాధ్యక్షుడు బిల్‌క్లింటన్ భారత పర్యటనకు ముందుగా ఈ ఘాతుక చర్య చోటు చేసుకున్నది. శిక్కుప్రజల హత్యకు బాధ్యులైన ఐదుగురు పాకిస్తానీ టెర్రరిస్టులను ఎదురుకాల్పులలో తాము మట్టుబెట్టామని భారతసైన్యం సగర్వంగా ప్రకటించిందికూడా!

కానీ, సైన్యం ప్రకటించిన ఈ ఎదురు కాల్పుల ఘటనకు కొద్ది ముందు నుండీ తమతమ కుటుంబ సభ్యులు కొందరు అదృశ్యమయ్యారని అనంతనాగ్ జిల్లాలోని వివిధ గ్రామాల ప్రజానీకం ఫిర్యాదు చేస్తూ వచ్చారు. 'ఎదురుకాల్పులలో' చంపబడిన ఐదుగురు 'టెర్రరిస్టుల' మృతదేహాలూ పంచనామా చేయబడ్డాయి; తమతమ కుటుంబ సభ్యులు అదృశ్యమయ్యారని ఫిర్యాదు చేసిన వారు ఆ మృతదేహాలు తమవారివేనని గుర్తించారుకూడా! కనుక సైనికులు హత్యగావించిన ఆ ఐదుగురూ, సైన్యం పేర్కొంటున్న విధంగా పాకిస్తానీ టెర్రరిస్టులు కానే కాదని వెల్లడైంది.

ఐదుగురు అమాయక పౌరులను సైనికాధికారులు నిలువుగా కాల్చి చంపిన కేసులో సైతం, బాధిత కుటుంబాలకు రక్షణ మంత్రిత్వ శాఖ న్యాయం కలుగజేసేందుకు సిద్ధంకాలేదు. సైనిక బలగాల చట్ట ప్రకారం తనకున్న విశేషాధికారాలతో వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేసింది. బూటకపు ఎన్‌కౌంటర్‌పై నిజాయితీగా విచారణ జరగనీయకుండా అన్ని చర్యలనూ చేపట్టింది. హత్యకు గురైనవారి మృతదేహాలను శాస్త్రీయంగా గుర్తించేందుకు వారికి డిఎన్‌ఏ పరీక్షలు జరిగే క్రమంలో, విచారణ ప్రాథమిక దశలో వున్నపుడే సేకరించిన డిఎన్‌ఏ నమూనాలను నిర్లక్షపూరితంగా రూపుమాపివేసింది. ఆ విషయం వెల్లడవటంతో తిరిగి రెండవ పర్యాయం పరీక్షలు నిర్వహించటంతో సైనికుల ఘాతుకం మరింత బట్టబయలైంది. ఐదుగురు మృతులనూ గుర్తించారు. సైనిక బలగాల ప్రత్యేకాధికారాల చట్టం (ఏఎఫ్ఏస్‌పిఏ) ద్వారా అసాధారణ అధికారాలు సైనికబలగాలకు సంక్రమించాయనటంలో సందేహం లేదు. నిర్భయంగా జమ్ముకాశ్మీర్ రాష్ట్రంలో ఈ విధమైన బూటకపు ఎదురు కాల్పులు జరిపేందుకు ఇదే వారికి కొమ్ములనిచ్చింది. 1994లో చొరబాటుదారులను నిరోధించే కార్యక్రమంలో భాగంగా అసోమ్‌లోని సైకోవా రిజర్వు ఫారెస్టులో సైనికబలగాలు ఈ రకమైన ఎదురుకాల్పులను సాగించాయి.

ఏమైనా, ఈ సంఘటనలను పరిశోధించిన సిబిఐ, సంబంధిత వాస్తవాలనన్నీ నిర్ధారించి ఆ మేరకు 2006లోనే శ్రీనగర్ కోర్టులో ఆరోపణల పత్రాన్ని సమర్పించింది. కానీ దీనిపై ఒక ప్రాథమిక దర్యాప్తు నివేదిక (ఎఫ్ఐఆర్‌ను) రూపొందించేందుకు దాదాపు ఆరుసంవత్సరాల కాలం పట్టింది. సైనికులు బూటకపు ఎదురుకాల్పులకు పాల్పడలేదని తమను తాము సమర్థించుకునేందుకు పూనుకోవటంతో పాటుగా, సైనికబలగాలకు విరుద్ధంగా వారిపై న్యాయ విచారణను చేపట్టాలంటే ముందస్తుగా సైనికాధికారుల నుండి అనుమతి తీసుకోవాలని వాదించారు. అమాయక పౌరుల క్రూరహత్యకు కారకులైన సైనికులకు వ్యతిరేకంగా విచారణను నిలిపి వేయాలని రక్షణ మంత్రిత్వశాఖ ఆదేశించింది. కనీసం సైనికుల నడుమ కోర్టు మార్షల్ నిర్వహంచేందుకు కూడా అది తన ఆమోదం తెల్పలేదు. ఈ విధంగా సైనిక బలగాలు మరియు రక్షణ మత్రిత్వశాఖ–తమ తప్పిదాన్ని కప్పిపుచ్చేందుకు, సైనికులను విచారించే ఏ విధమైన న్యాయపరక్రమాన్నీ జరగనీయకుండా నిరోధించాయి.

ఆ ఘటనపై తీర్పు వెలువరించటానికి ఉన్నత న్యాయస్థానాలకు ఆరుసం॥ల కాలం పట్టింది. ఈ కేసులోని అన్ని న్యాయపరమైన కోణాలనూ పరిగణనలోకి తీసుకున్నాక చిట్టచివరకు సుప్రీంకోర్టు తన తీర్పును వెలువరించింది. ఏఎఫ్ఎస్‌పిఏ అమలులో వున్న ప్రాంతాల్లో ఏవైనా ఆరోపణలనెదుర్కొనే సైనికాధికారులపై, లేదా సైనికులపై గానీ న్యాయపరమైన విచారణ జరిపేందుకు కేంద్రప్రభుత్వం ఒక తప్పనిసరి ఆంక్షను విధించింది. ఈ విధంగా చట్టపర చిక్కుల సందర్భంలో ,సైనిక బలగాలను చట్టానికంటే ఉన్నతంగా నిలపటంద్వారా మనదేశంలో చట్టం, న్యాయం ఎదుట అందరూ సమానులు కారనే అంశాన్ని సుప్రీంకోర్టు పరోక్షంగా అంగీకరించింది.

భారత ప్రజలకు గానీ, వారితో సహా జమ్ముకాశ్మీర్ రాష్ట్రం పాటెన్సిబాల్‌వద్ద జరిగిన బూటకపు ఎదురు కాల్పులలో హత్యగావించబడిన ఐదుగురు అమాయక పౌరుల కుటుంబాలకు గానీ, ఈ తీర్పు ఏ విధంగానూ స్వాంతన చేకూర్చేదికాదు. మరో వైపున, వారికి ఇక న్యాయం జరగదని, చట్టం ఎదుట అందరూ సమానులు కారని, అయితే మరికొందరు ఆ చట్టానికి గౌరవనీయులుగా, చుట్టాలుగా వుంటారని, ఈ దేశంలో న్యాయమనేది ఒక సుదూరపు కలగానే వుండిపోతుందని మరింతగా స్పష్టమైంది.

సుప్రీంకోర్టుతో సహా మనదేశంలోని అన్ని ఉన్నత న్యాయస్థానాలు, న్యాయవ్యవస్థ–దోపిడీ అణచివేతలతో తమ నిర్బంధ పాలనను కొనసాగిస్తూవస్తున్న పాలకవర్గాల సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థనుండి విడివడిన స్వతంత్రమైనవి కాదని, లేదా శక్తివంతమైనవీకాదని, న్యాయవ్యవస్థకూడా ఈ దోపిడీ వ్యవస్థకు లోబడినదేననే విషయాన్ని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రుజువు చేస్తున్నది.

మనచట్టాలు, న్యాయవ్యవస్థ స్వతంత్రంగా రూపొందించుకున్నవి కావనీ, బ్రిటిష్ వలస పాలకుల వారసత్వంగా సంక్రమించినవేననీ, న్యాయానికేమాత్రమూ అవకాశం లేకుండా అణచివేయటం ద్వారా భారత ప్రజలను పాలించటానికి వారే ఈ వ్యవస్థలను ఏర్పరిచారనీ, సుప్రింకోర్టు తీర్పులోని చట్టపరమైన లొసుగులు, పరిమితులు స్పష్టం చేస్తున్నాయి.

వాస్తవాలు ఇవి కాగా, పాలకవర్గాల, పాలకుల పక్షాలకు వ్యతిరేకమైన వారికి సమన్యాయం జరుగుతుందని ఆశించటం తెలివిమాలినదే అవుతుంది.

టెర్రరిస్టులను, చొరబాటుదారులను అణచివేసే పవిత్ర కర్తవ్యాలను నిర్వహించే సైనిక బలగాల యొక్క ఆత్మస్థైర్యాన్ని కాపాడేందుకోసమంటూ జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలో ఐదుగురు అమాయకులను నిలువుగా క్రూరంగా హత్యగావించిన సైనికాధికారులపై విచారణ జరపటానికి మన కేంద్ర ప్రభుత్వం అనుమతినీయకుండా నిరాకరించటం పెద్దగా ఆశ్చర్యం కల్గించేదేమీ కాదు. ఈ విధంగా సైన్యం చేతిలో హత్యకు గురైన అమాయకులైన ఐదుగురి కుటుంబాలకు న్యాయం నిరాకరింపబడింది. ఇక, అమాయకులను హత్యగావించిన సైనికాధికారులను శిక్షించి న్యాయాన్ని అందించేందుకు తనకు గల అసాధరణ అధికారాలనుపయోగించే ప్రయత్నం కూడా చేయకుండా సర్వోన్నత న్యాయస్థానం దోషులను కాపాడే విధంగా మిగిలిపోయింది.

ఇదీ, మనదేశంలోని 'స్వతంత్ర' న్యాయవ్యవస్థ, అది అందించే 'న్యాయం' యొక్క డొల్లతనం! ✡

# కెనడా: క్విబెక్ రాష్ట్రంలో ఆందోళన సాగిస్తున్న విద్యార్థులపై పాశవిక నిర్బంధం

**కెనడాలోని** క్విబెక్ రాష్ట్రంలో కళాశాల విద్యార్థులు తమ ఫీజుల పెంపుకు వ్యతిరేకంగా ఆనాటికి 12 వారాలుగా సమ్మె కొనసాగిస్తున్న రిపోర్టును **'జనశక్తి'** గత సంచికలో (20–5–12 సంచిక) ప్రచురించాం.

వారి ఆందోళన కొనసాగుతూ 14 వారాల సమయం గడిచేసరికి విద్యార్థుల ఉద్యమాన్ని అణచి వేసేందుకు క్విబెక్ జాతీయ అసెంబ్లీ అత్యవసర చట్టాన్ని (78వ బిల్లును) ఆమోదించింది. దీని ప్రకారం ఈ క్రింది అంశాలు తక్షణం అమలులోకి వచ్చాయి.

విశ్వవిద్యాలయభవనాల నుండి 50 మీటర్ల పరిధిలో విద్యార్థులు ఎలాంటి నిరసనా చేపట్టరాదు.

అధ్యాపకులు కూడా ఈ 78వ బిల్లు ప్రకారం తమ విధులను సక్రమంగా నెరవేర్చాలి. సమ్మె చేస్తున్న విద్యార్థులను తరగతి గదులలోకి అనుమతించటం; వారికి సహకరించటం వంటి చర్యలు చట్టవిరుద్ధం.

కారణాలు ఏమైనప్పటికీ పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా 50 మంది లేదా అంతకు మించి పోగవటం, ధర్నా, ప్రదర్శనలు నిర్వహించటం చట్ట వ్యతిరేకం.

ఈ నిబంధనలను అతిక్రమించిన వారెవరైనా పెద్దఎత్తున జరిమానా విధింపుకు గురౌతారు.

విద్యార్థుల, ఆందోళనాకారుల హక్కులను హరించివేసే ఈ 78వ బిల్లును కెనడా పాలక పక్షం స్వాగతించింది. క్విబెక్‌లో ప్రఖ్యాతిగాంచిన లాప్రెస్సే దినపత్రిక 'హింస, దారి తప్పటాలనే పామును చంపేందుకు అవసరమైన ఆయుధం'గా ఈ చట్టాన్ని పేర్కొంది.

ఏమైనా ఆందోళన సాగిస్తున్న విద్యార్థులపై రాజ్యహింసకు ఈ చట్టం ఒక పరాకాష్ట. పోలీసులే రెచ్చగొట్టి భాష్పవాయుప్రయోగం, లాఠీఛార్జీ, శబ్దాలు వెలువరించే బాంబులు, రబ్బరు బుల్లెట్స్‌ను విద్యార్థులు, వారి మద్దతుదార్లపై ప్రయోగిస్తున్నారు.

కళాశాల విద్యార్థుల నిరవధిక ఆందోళనపట్ల పాలకులు ఇంతగా భయోత్పాతానికి గురికావటం–తాము ప్రతిస్థాయిలోనూ అమలు చేస్తున్న పొదుపు చర్యలకు వ్యతిరేకంగా ఈ ఆందోళన రగులుకుంటుందనే భయం నుండేనని స్పష్టమౌతున్నది.

గత సంవత్సరకాలంగా కెనడా ఫెడరల్ కన్‌సర్వేటివ్ ప్రభుత్వం పదేపదే ఈ ఎమర్జన్సీ చట్టాలను ప్రయోగించింది. ఎయిర్ కెనడా, కెనడాపోస్టువర్కర్స్‌తో సహా ఆందోళనలన్నింటినీ నిరోధించేందుకు సామూహిక బేరసారాలాడే కార్మికుల హక్కులను లాగి వేయటానికి పూనుకుంటున్నది.

విద్యా సముపార్జన, గౌరవనీయ ఉద్యోగాలను సామాజిక హక్కులుగా నినదిస్తూ విద్యార్థులు గత 14 వారాలుగా సాగిస్తున్న సమ్మె, అధికారంలో వున్న ప్రభుత్వానికి మాత్రమేగాక పెట్టుబడిదారీ సామాజిక వ్యవస్థకే వ్యతిరేకమైనది.

క్యుబెక్ ప్రభుత్వమూ, కెనడా ఎలైట్ ప్రభుత్వమూ విద్యార్థుల ఈ ఆందోళనల పట్ల; బిల్ 78కి వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న నిరసనలపట్ల వణికిపోతున్నాయి.

సమ్మె వందవ రోజుకు చేరుకున్న సందర్భంలో మాంట్రియల్ చరిత్రలోనే అతిపెద్దదైన ఒక లక్షా 50 వేలమందిపైగా విద్యార్థుల ప్రదర్శన జరిగింది.

పోలీసుల హింసను ధిక్కరిస్తూ మాంట్రియల్‌లో బిల్ 78కి వ్యతిరేకంగా రాత్రిపూట ఆందోళనలు జరుగుతున్నాయి. పెద్దఎత్తున విధించబడుతున్న జరిమానాలను, అరెస్టులను విద్యార్థులు లెక్కచేయటం లేదు.

క్విబెక్ పాలకుల నిర్బంధ చట్టాలను ధిక్కరించి కళాశాల విద్యార్థుల సమ్మె మే 26 నాటికి 15వ వారానికి చేరుకున్న సమయంలో క్విబెక్ ప్రభుత్వం విద్యార్థి నాయకులతో చర్చలకు సంసిద్ధతను వ్యక్తం చేసింది. బహుశా ఈ చర్చలు ఈ వారాంతంలో జరగవచ్చు.

ఆందోళనలో భాగస్వాములైన మూడు విద్యార్థి సమాఖ్యలను ఈ చర్చలకు ప్రభుత్వం ఆహ్వానించింది. 82శాతం విశ్వవిద్యాలయ ట్యూషన్ ఫీజులు రాబోయే 7సం॥ కాలంలో విడతలవారీగా పెంచాలనే; 78 బిల్లు వంటి నిర్బంధ చట్టాలను అమలు చేయాలనే ప్రభుత్వ విధానాలలో మార్పులనేమీ చర్చించబోమని, కొందరు ప్రభుత్వ ప్రతినిధులు ప్రకటిస్తూవస్తున్నప్పటికీ చర్చలలో తామంతా ఒక ఉమ్మడి అవగాహనా ప్రాతిపదికపై పాల్గొంటున్నట్లుగా ఈ మూడు విద్యార్థి సంఘాల ప్రతినిధులు ప్రకటించారు. ✡

# 'బి.టి వంకాయ సాగు హానికరం'

## గ్రీన్ పీస్ ఇంటర్నేషనల్ అధ్యయనం

**జన్యుమార్పిడి** పద్ధతిలో రూపొందించిన బిటి వంకాయను భారత వ్యవసాయ రంగంలోకి ప్రవేశ పెట్టేందుకు చేసిన ప్రయత్నానికి తీవ్ర వ్యతిరేకత రావటంతో భారత ప్రభుత్వం వెనుకడుగు వేసింది. బిటి వంకాయ విత్తనాన్ని ప్రవేశ పెట్టడంపై నిషేధాన్ని విధించింది. అయితే దానిని ప్రవేశ పెట్టాలన్న తన ఉద్దేశ్యాన్ని మార్చుకోలేదు. బిటి వంకాయ సాగువల్ల రైతాంగానికి ఒనగూడే లాభాల గురించీ, దాని వాడకం క్షేమకరమనీ తరచుగా ప్రచారం సాగిస్తున్నది.

ఈ నేపథ్యంలో గ్రీన్‌పీస్ ఇంటర్నేషనల్ అనే సంస్థ కొందరు శాస్త్రజ్ఞులతో దీనిపై అధ్యయనం చేయించింది. "జన్యుమార్పిడి బిటి వంకాయ–వృక్ష జీవ వైవిధ్యంపై ప్రభావం" అన్న పేరిట వారి నివేదికను విడుదల చేసింది. బిటి వంకాయను ప్రవేశ పెట్టరాదంటూ చేసిన వాదనలు సరైనవేనని నిర్ధారించిన ఈ నివేదిక మరొక అదనపు అంశాన్ని బయటపెట్టింది.

వంకాయ జాతి వృక్షకుటుంబానికి చెందిన మొక్కలు అనేకం వున్నాయి. వాటిని సాగు చెయ్యరు. కానీ సహజంగా పెరుగుతుంటాయి. ఈ వృక్ష కుటుంబానికి దగ్గరగా వుండే మొక్కలు కొన్ని సాగులో వుంటాయి. వీటితో పరపరాగసంపర్కం ద్వారా ఫలదీకరణ చెందే లక్షణం బిటి వంకాయ కుందని ఈ అధ్యయనం తెలిపింది.

బాసిల్లస్ తురిన్జెన్సిస్ అన్న సూక్ష్మక్రిమి నుండి తీసిన జన్యువును వంకాయ జన్యువుల్లో చేర్చుతారు. దీనివల్ల కొన్ని కాయతొలుచుపురుగులు వంకాయ పంటను ఆశించవు. ఫలితంగా పురుగులేని వంకాయలతో దిగుబడులు పెరగటంతో పాటు పురుగు మందుల వాడకం తగ్గి రైతాంగానికి లాభదాయకమని మాన్సాంటో కంపెనీ వాదన. బిటి ప్రత్తి విత్తనాల వాడకం ఈ వాదన తప్పని ఇప్పటికే నిరూపించింది. బిటి విత్తనాల వాడకం తర్వాత కూడా పురుగు మందుల వాడకం తగ్గలేదు. ఎకరాకు దిగుబడులూ పెరగలేదని అనేక అధ్యయనాలు తెలిపాయి.

ఇప్పుడు గ్రీన్‌పీస్ అధ్యయనం తెలిపిన అంశం తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తుంది. ఇతర బంధుజాతి వృక్షాలతో సంపర్కం చెందగల లక్షణం బిటి వంకాయకున్నందున దానిలోని బిటి జన్యువు కూడా ఆ వృక్ష జాతుల్లోకి ప్రవేశిస్తుంది. సహజంగా పెరిగే ఈ జాతులకు కొన్ని పురుగులు ఆశించకుండా చేసే నిరోధక శక్తి కూడా బిటి జన్యువుతో వస్తుంది. దీనితో ఇవి విపరీతంగా పెరిగి విస్తరించి పర్యావరణ సమస్యను సృష్టిస్తాయి. కొన్నేళ్ల క్రితం పేదలకు వంట చెరకు అవసరాలు తీర్చడానికంటూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంగ్లీషు తుమ్మచెట్లు ఇలాగే విస్తరించాయి. అలాగే బిటి జన్యువు చేరిన ఈ మొక్కలు పొలాలలోకి చేరి మందులకు లొంగని కలుపు మొక్కలవుతాయి. కనుక క్షేత్రస్థాయి ప్రయోగాలతో సహా ప్రయోగశాలకు బయట వీటి పెంపకాన్ని అనుమతించ రాదని ఈ అధ్యయనం సూచించింది. ఆసియా దేశాలంతటా సాగు అయ్యే వంకాయకు బంధుత్వ వృక్ష జాతుల గురించిన శాస్త్రీయ సమాచారం తగినంతగా అందుబాటులో లేనందున బిటి వంకాయ సాగుకు అనుమతి నివ్వటంలో ప్రభుత్వాలు మరింత జాగరూకత వహించాలని హెచ్చరించింది.

విషతుల్యమైన బిటి జన్యువు చేర్చిన వంకాయ ఆహారంగా తీసుకున్నందున ఆరోగ్యానికి హాని కలిగే అవకాశం గురించి అధ్యయనం చాలా తక్కువగా వుందని కూడా ఆ నివేదిక తెలిపింది. క్షేత్రస్థాయి ప్రయోగాల సందర్భంలోకూడా పొరుగునసాగయ్యే పంటల్లోకి చేరగల అవకాశమున్నందున, అది మానవ ఆరోగ్యానికి చెరుపు కలిగించదని స్పష్టం కానందున, ప్రయోగశాలలకు బయట బిటివంకాయపెంపకాన్నిఅనుమతించరాదనిసూచించింది.

బిటి వంకాయపై క్షేత్రస్థాయి ప్రయోగాలు బంగ్లాదేశ్‌లోనూ, థాయిలాండ్‌లోనూ సాగుతున్నాయి. ప్రభుత్వానికి తెలుపకుండా మాన్సాంటో తదితర కంపెనీలు క్షేత్రస్థాయి ప్రయోగాలను భారత్‌లో సాగిస్తున్నాయన్న వదంతులు కూడా వ్యాప్తిలో వున్నాయి. కనుక బిటి వంకాయ పునఃప్రవేశ ప్రయత్నాల పట్ల ప్రజాస్వామిక వాదులు మరింత జాగరుకతతో ఉండాల్సిన అవసరముంది. ✡

# పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా ప్రపంచవ్యాపితంగా ఉత్సాహభరితంగా

## 'మేడే' నిర్వహించుకున్న కార్మిక, శ్రామిక ప్రజానీకం



ప్రపంచంలోని వివిధ దేశాలలో కార్మికులు మేడేని ఒక పోరాటదీక్షా దినంగానూ, అంతర్జాతీయ దోపిడీ పీడనలపై ఒక నిరసన దినంగానూ పాటిస్తూ వస్తున్నారు. ఈ సంవత్సరం వందల, వేల సంఖ్యలో కార్మికులు ఈమేడే ప్రదర్శన – ధర్నా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని ఆర్థికఅసమానతలకు వ్యతిరేకంగా ఒక నిరసనగా ప్రారంభమైన 'వాల్‌స్ట్రీట్ ముట్టడి ఉద్యమం' ఆధ్వర్యంలో **అమెరికా** దేశమంతటా మేడే సందర్భంగా ధర్నా కార్యక్రమాలను నిర్వహించారు. వేలాదిమంది కార్మికులు, ప్రజానీకం ఈ ధర్నాలలో పాల్గొన్నారు, నిరసనధర్నాలు, సమ్మెలు, సహాయ నిరాకరణ కార్యక్రమాలలో ఈ మేడే సందర్భంగా వేలాదిమంది కార్మికులు పాల్గొన్నారు. న్యూయార్క్, శాన్‌ఫ్రాన్సిస్‌కో, కొరెగాన్, ఓక్‌లాండ్‌లలో కార్మిక వ్యతిరేక, పేద ప్రజల వ్యతిరేక ప్రభుత్వ విధానాలపై నిరసన గళమెత్తారు.

**జపాన్‌లో** వేలాదిమంది ప్రజలు టోక్యోలో జరిగిన ప్రదర్శనలో పాల్గొని వీధుల్లో అరుణ పతాకాలతో కవాతు నిర్వహించారు.

యూరప్‌లో – ప్రభుత్వాలు అనుసరిస్తున్న పొదుపు చర్యలకు నిరసనగా వివిధ దేశాల ప్రజానీకం కార్మికులు భారీస్థాయి నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేపట్టారు.

**స్పెయిన్‌లోని** మాడ్రిడ్‌లో పొదుపుచర్యలను వ్యతిరేకిస్తూ కార్మికులు ఒక భారీ ప్రజానిరసన ప్రదర్శనను నిర్వహించి నగరంలోని ప్రధాన కూడలిలో ధర్నా జరిపారు. బడాపెట్టుబడి చేతిలో కీలు బొమ్మలుగా మారుతున్న రాజకీయ నాయకులకు వ్యతిరేకంగావారు తమ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు.

**గ్రీస్‌లో** ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల కార్మికులు సమ్మెలతో మేడేని స్వాగతించారు. ప్రభుత్వాలు చేపట్టిన పొదుపు చర్యలకు వ్యతిరేకంగా దేశవ్యాపితంగా భారీఎత్తు ప్రజా ప్రదర్శనలు నిర్వహించారు.

**పోర్చుగల్‌లో** కార్మికులు వివిధ రంగాల ట్రేడ్ యూనియన్‌ల ఆధ్వర్యంలో ఎర్రజెండాలతో మేడే ప్రదర్శనను నిర్వహించారు.

**జర్మనీలో** ప్రభుత్వాలు అనుసరిస్తున్న పొదుపు చర్యలపై, అంతులేకుండా పెరిగిపోతున్న నిరుద్యోగంపై తమ యూనియన్ల కార్మికులు భారీ నిరసన ధర్నాలు, ప్రదర్శనలను దేశవ్యాపితంగా నిర్వహించారు.

**ఫ్రాన్స్‌లో** వందల, వేల సంఖ్యలో కార్మికులు–బడాపెట్టుబడిదారుల పరిశ్రమలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలనందిస్తూ, ఆర్థిక మాంద్యం సంక్షోభాలను మాత్రం తమ భుజస్కంధాలపై మోపటాన్ని వ్యతిరేకిస్తూ నిరసన ధర్నాలు, ప్రదర్శనలు పెద్దఎత్తున నిర్వహించారు.

**రష్యాలో** కార్మికులు దేశవ్యాపితంగా మేడే కార్యక్రమాలను నిర్వహించారు. మాస్కోలో–గత కాలపు సోవియట్ యూనియన్ నిర్వహించిన తరహాలో లక్షలమంది కార్మికులతో భారీ అరుణపతాక కవాతును నిర్వహించారు.

ఆసియా దేశంలోనూ భారీ సంఖ్యలో కార్మికులు పాల్గొని మేడే ప్రదర్శనలు నిర్వహించారు.

**కౌలాలంపూర్‌లో** వేలాదిమంది కార్మికులు తమ ప్రధాని ప్రకటించిన ప్రైవేటు రంగంలోని కార్మికుల కనీసవేతనాలను నిరసిస్తూ మేడే సందర్భంగా ప్రదర్శనలు నిర్వహించారు.

**హాంకాంగ్‌లో** ఐదువేలమంది కార్మికులు కనీస వేతనాల పెంపును డిమాండ్ చేస్తూ మేడే కార్యక్రమాలను నిర్వహించారు.

**ఇండోనేషియా** రాజధాని జకార్తాలో తొమ్మిదివేల మంది కార్మికులు మేడే కార్యక్రమాలలో పాల్గొని ఉద్యోగ రక్షణను, మెరుగైన వేతనాలను డిమాండ్ చేశారు.

**ఫిలిపిన్స్** రాజధాని మనీలాలో ఎనిమిది వేలమంది కార్మికులు వేతనాల పెంపుదలను డిమాండ్ చేస్తూ మేడే కార్యక్రమాలను నిర్వహించారు. ✡

## నివాస స్థలాలకై పేదల ధర్నా

**గుంటూరు, 14-5-12 :**

ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ విభాగాలకు, ఇతర కులాలకు చెందిన పేద ప్రజానీకం, తమకు ఇళ్ళస్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన గుంటూరులో ప్రదర్శన నిర్వహించారు. 'గ్రీవెన్స్‌డే' సందర్భంగా ప్రజలనుండి విజ్ఞాపనలను స్వీకరిస్తున్న జిల్లా పరిషత్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించి తమ సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మెమోరాండం అందజేశారు.

ఈ సందర్భంగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు కా॥ సింహాద్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ స్వతంత్రమొచ్చిందని చెప్తున్న ఆరుదశాబ్దాల అనంతరం కూడా నిరుపేదలకు తలదాచుకోనుగూడు, నివాసానికి కాసింత స్థలాన్ని ఈ పాలకులు సమకూర్చలేక పోవటాన్ని తీవ్రంగా ఎండగట్టారు. సంఘం జిల్లా కార్యదర్శి కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు మాట్లాడుతూ సెజ్‌ల పేరుతో, ప్రాజెక్టులు, పరిశ్రమలపేరుతో వేలాది ఎకరాలను బడాపెట్టుబడి వర్గాలకు కట్టబెడ్తున్న పాలకులు నిరుపేదలకు సెంటు స్థలాన్ని కేటాయించక పోవటం – వారు ఏ వర్గాల ప్రయోజనాల్ని కాపుగాస్తున్నారో తెలియజేస్తున్నదన్నారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కా॥ పాటిబండ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ, రెంటచింతల గ్రామంలో 300 సర్వే నెంబరులో అన్యాక్రాంతం కాబడిన అసైన్డ్ భూమిని గ్రామంలో నిరుపేదలకు ఇళ్ళస్థలాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ✡

## పేదల ఇళ్ళస్థలాలు పేదలకే దక్కాలని ఐక్య ఆందోళన

**చల్లపల్లి, 4-4-12 :**

చల్లపల్లి నారాయణరావునగర్‌లో 112.67 ఎకరాల విస్తీర్ణపు భూమిలో పేదప్రజలకు నివేశన స్థలాలు కేటాయించాలని గత కాలంలో సాగిన ఆందోళనల ఫలితంగా ప్రభుత్వం దానిని 2370 ప్లాట్లుగా విభజించి పేద ప్రజలకు ఇస్తామని ప్రకటించింది. ఇందులో 470 ప్లాట్లను రెవిన్యూ అధికారులు, బ్రోకర్లు, రాజకీయ నాయకులు అక్రమంగా అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. కాగా పేదలకు కేటాయించబడినది 1900 ప్లాట్లుగా చెప్తున్నారు.

ఈ ప్లాట్ల పంపిణీలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)తో సహా వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు పలుదఫాలుగా చేసిన డిమాండ్ ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చి ఒక విచారణ నిర్వహించింది. రెవిన్యూ సిబ్బందితో కూడిన 24 బృందాలు చల్లపల్లి నారాయణరావు నగర్‌లో విచారణ జరిపారు. 1726 మందిని అక్రమ కొనుగోలుదారులుగా ప్రకటించి, అసైన్డ్‌ల్యాండు చట్టం ప్రకారం వారి ప్లాట్లను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ఉపక్రమించారు.

రెవిన్యూ సిబ్బంది తమ విచారణ సందర్భంగా విచక్షణా రహితంగా వ్యవహరించారు. చేతులు మారిన ప్రతిప్లాటూ అక్రమమైనదనే రీతిలో, కొనుగోలు చేసినవారందరూ నేరస్తులనే రీతిలో వ్యవహరించారు.

ఈ నేపథ్యంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) నాయకత్వం ప్లాట్ల అక్రమాలపై విచారణకు రెవిన్యూ అధికారులు అనుసరించిన విధానాన్ని విమర్శిస్తూ, అర్హులైన పేదల చేతిలో నున్న పట్టాలను బేషరతుగా వారికే దఖలు పరచాలని, మధ్యతరగతి, చిన్నవృత్తి దారులు, కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించాలని, ధనికులు, దళారులు కబ్జాచేసిన, అక్రమంగా ఆక్రమించిన లేదా కొనుగోలు చేసిన ప్లాట్లను బేషరతుగా గుంజుకొని అర్హులైన పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేసింది.

తదనుగుణంగా స్థానిక కాంగ్రెస్, తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్ తదితర పార్టీలు, సంఘాలతో కలసి చల్లపల్లి తహసిల్‌దారు కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున రాస్తారోకో, ధర్నా కార్యక్రమాలను నిర్వహించింది.

ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ జె.జగన్, కా॥ రాంబాబులతోపాటు ఇతర పార్టీల ప్రతినిధులు, పెద్దసంఖ్యలో పేద ప్రజానీకం పాల్గొన్నారు. ✡

## ఉపాధి హామీ పనులు కల్పించాలని ఆందోళన

**పార్వతీపురం, 14-5-12 :**

గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని సక్రమంగా అమలుచేసి, గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించి వలసలు నివారించాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా –పార్వతీపురం ఎమ్‌పిడిఓ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా రైతుకూలీసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కా॥ బొత్స నరసింగరావు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం అమలులో రాష్ట్రంలో విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో ఉందని ప్రచారం చేస్తున్నారు మినహా, వాస్తవపరిస్థితి ఆ విధంగా లేదన్నారు. పార్వతీపురం మండలంలోని సంగం వలస పంచాయితీలో 20 గ్రూపులకు రెండువారాలుగా పనులు లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులనెదుర్కొంటు న్నారన్నారు. రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కా॥ శ్రీనునాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన విధంగా 137 రూ॥ కూలి బదులుగా 60–70 రూ॥ మాత్రమే చెల్లిస్తున్నారని, ఇందులో అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కామ్రేడ్స్ భాస్కరరావు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఏపిడీకి అందజేసి చర్చించగా మే 17వ తేదీ నుండి వారందరికీ ఉపాధి కల్పిస్తామని హామీనిచ్చారు. ధర్నాకు ముందుగా పార్వతీపురం బైపాస్ కాలనీలోని రైతుకూలీ సంఘం కార్యాలయం నుండి ఎమ్‌పిడిఓ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ✡

## పెట్రోలు ధర పెంపుకు నిరసన




**మచిలీపట్నం, 25-5-12 :**

పెంచిన పెట్రోలు ఛార్జీలను వెనువెంటనే, పూర్తిగా వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీసంఘం (ఆం.ప్ర.), ఎఐఎఫ్‌టియు(న్యూ)ల ఆధ్వర్యంలో స్థానిక కోనేరు సెంటర్‌లో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకురాలు కా॥ పామర్తి అంజమ్మ మాట్లాడుతూ పెట్రోల్ ధర లీటరుకు ఒక్కసారిగా రు. 7–50 పెంపుదల చేయటం మధ్యతరగతి ప్రజానీకానికి పెనుభారంగా మారుతుందన్నారు. ఒకవైపున ప్రజారవాణా వ్యవస్థను తగ్గించివేస్తూ, వ్యక్తిగత వాహనాల సంఖ్యను ఇబ్బడి ముబ్బడిగా పెంచుతూ, పెట్రోల్ వినియోగాన్ని పెద్దస్థాయిలో పెంచేవేసిన అనంతరం–గతదశాబ్దకాలంలో 30రూ॥ పెట్రోలు ధరను ఈనాటికి దాదాపు 80 రూ॥కు పెంచటం ద్వారా ప్రజలపై పెనుభారాన్ని మోపటమే గాక పెట్రోలు దిగుమతుల మోతాదుకూడా తీవ్రవ్మైందన్నారు. ప్రజారవాణా వ్యవస్థను పెంపొందించాలని, పెట్రోలు ధరల పెంపుదలను వెనువెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఇంకా ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ ముచ్చు సుధాకర్; కా॥ కొప్పినేని ఉమామహేశ్వరరావు, ఈపూరి రాంబాబు, జి. మల్లేష్ పాల్గొని ప్రసంగించారు. ✡

### అమరుల సాక్షిగా... (చివరి పేజీ నుండి)

సహజవాయువు లాంటివాటిపై బహుళజాతి సంస్థల ఆధిపత్యం పెరిగిపోయిందనీ కావున తొలితరం కమ్యూనిస్టుల ఆశయాల సాధనకు సమరశీల ప్రజాపోరాటాలు సాగించటం అవసరం అని పిలుపునిచ్చారు.

స్థూప నిర్మాణ కమిటీ సభ్యులు బొమ్మారెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, ఆనాడు నిస్వార్థంగా ప్రాణాలకు తెగించి పార్టీకోసం శ్రమించిన వారికి పార్టీలో వచ్చిన చీలికలు, వేదనలు మిగుల్చుతున్నాయన్నారు. స్థూప నిర్మాణ కమిటీ సభ్యులు ఆళ్ళ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికైనా క్రింది నుంచి చర్చలు జరిపి పైకమిటిలకు పంపితే చీలికల సమస్య పరిష్కారానికి నాయకత్వాలు ఆలోచించ టానికి ఉపయోగకరంగా వుంటుందని చెప్పారు.

సిపిఐజిల్లా నాయకులు వెలగపూడి అజాద్ మాట్లాడుతూ, ఇక్కడ ప్రారంభించబడిన కమ్యూనిస్టు వెంకటరెడ్డి భవనం ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందనీ, చీలికలు నివారించి పార్టీలు ఐక్యత కావాలన్నా రంగారెడ్డి లాంటి అభిమానుల కోర్కెలను నెరవేర్చాల్సిన బాధ్యత మనమీదవుందన్నారు.

సిపియం గ్రామ నాయకులు ఈడా పరశు రామయ్య మాట్లాడుతూ, పాలకవర్గ పార్టీలతో పొత్తులు పెట్టుకోవటం సరికాదని, గ్రామస్థాయి నుంచి ఐక్యత పెరగాలని చెప్పారు.

టియన్ మెమోరియల్ ట్రస్టు నాయకులు భీమవరపు గురవారెడ్డి మాట్లాడుతూ, కమ్యూనిస్టులు ఆశాజీవులని, నేటి చీలికల పరిస్థితులను అధిగమించి తప్పక ముందుకెళ్తారనీ, మహనీయుడు లెనిన్ సంస్కరణ వాదం ఎటువంటి తీవ్ర ప్రభావాలు కలుగ చేస్తుందో విశ్లేషించారనీ, నెహ్రూ ఆవడి సోషలిజం ప్రకటనతో ఆనాటి కమ్యూనిస్టు పార్టీ నిలువునా చీలిపోయిందనీ, ఇందిరాగాంధీ గరీబీహటావో చీలికలను మరింతగా పెంచిందనీ ఎన్టీఆర్ పార్టీ ఆవిర్భావంతో, వైయస్ఆర్ ప్రారంభించిన పథకాల వెల్లువతో కమ్యూనిస్టులకు కార్యక్రమం లేకుండా పోయిందని, సంస్కరణవాద ప్రమాదాన్ని వివరించి సంక్షోభంలో వున్న ప్రజల కొరకు కమ్యూనిస్టులు ఐక్యం కావాల్సిన ఆవశ్యకత వుందని ఎంతో ఆవేదనతో చెప్పారు. చివరగా జనసాహితి రాష్ట్రకార్యదర్శి దివికుమార్ మాట్లాడుతూ అమరుల స్థూపాన్ని చూస్తేనే కొత్తబలం, జీవశక్తి, ఉద్వేగాలు కల్గుతాయని చెప్పారు.

ఉపన్యాసాల అనంతరం అమరజీవుల స్మారక పోటీల్లో గెలుపొందిన బాలబాలికలకు, పాల్గొన్న వారందరికీ సభకు విచ్చేసిన ఉపన్యాసకులు, ఆటల పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్ ఈడా వెంకట కృష్ణారావు బహుమతులు అందజేశారు.

**స్థూపంవద్ద నివాళులు**

అమరుల సంస్మరణ సభ ప్రారంభానికి ముందు స్థూపం వద్ద నున్న ఎర్రజెండాను కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ కామ్రేడ్స్ నినాదాల మధ్య ఆవిష్కరించారు. తర్వాత స్థూపంవద్ద పూలమాలను వుంచి నిర్మాణ కమిటీ సభ్యులు జోహార్లుచెప్పారు సభకు విచ్చేసిన వివిధ పార్టీల నాయకులు, పార్టీ అభిమానులు, స్థూపంవద్ద పూలు వుంచి నివాళులర్పించారు. ✡

# వరంగల్ జిల్లాలో ప్రజాందోళనలు

## నిరంతర సంఘర్షణల మధ్య సాగుతున్న చిలకమ్మనగర్ పోడుభూముల పోరాటం



చిలకమ్మనగర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న ఈక లచ్చక్క

**వరంగల్‌జిల్లా** ఖానాపురం మండలం చిలకమ్మనగర్ ప్రజల పోరాటం సంఘర్షణల మధ్య సాగుతూ ఉంది. 20 సంవత్సరాల క్రితం అప్పటి సిపిఐ(ఎం-ఎల్) (జనశక్తి) ఆధ్వర్యంలో పోకలచెరువు వద్దగల చిలకలగుట్ట దగ్గర అక్కడే 1975లో కాల్చివేయబడ్డ అమరులు రామనర్సయ్య జ్ఞాపకార్థం రామనర్సయ్యనగర్‌గా ఏర్పరచుకొని కొన్ని వందలమంది పోడునరుక్కున్నారు. నాటి పాలక పార్టీల వత్తిడితో పోలీసు యంత్రాంగం, ఫారెస్టు అధికారులు రామనర్సయ్య నగర్‌ని అనేకసార్లు తగలబెట్టటం, స్త్రీ పురుషులను చిత్రహింసలు పెట్టటం సాగించారు. నిత్యనిర్బంధం మధ్య ప్రజలు జీవించారు. నాటి నిర్మాణంలో తలెత్తిన వివిధ రకాల ధోరణులు, సమస్యలతో ఈ పోరాటానికి నాయకత్వం వహించిన రంపసోమన్న, కుంజా రామన్న తదితరులు ఎన్‌కౌంటర్‌కి బలికావడం వంటి పరిణామాలతో ఏదోఒక లోపాలతో పరిమితులతో అయినప్పటికీ ఉండిన నాయకత్వాన్ని ప్రజలు కోల్పోయారు. పోలీసు యంత్రాంగం కాలక్రమంలో రామనర్సయ్యనగర్ పేరు తొలగించి 'చిలకమ్మనగర్' అని పేరు పెట్టి అప్పటికి నివసిస్తున్న వారితో గ్రామంగా గుర్తించారు.

క్రమంలో చిలకమ్మనగర్ ప్రజలపై కొందరు పెత్తందార్లు పైచేయి సాధించారు. వీరే పాలక పార్టీల నుండి విప్లవ పార్టీలవరకు చెలామణి అవుతూవచ్చారు. పెరుగుతున్న ప్రజల అవసరాలు, నాయకుల ఆలోచనల మధ్య 10 సంవత్సరాల క్రితమే ప్రజలతో కలిసి ఒక వెయ్యి ఎకరాల అడవిని పోడుకొట్టుకున్నారు. పోడుకొట్టుకున్న ప్రజల మధ్య సక్రమంగా పంపిణీ జరగాలని కోరుకున్నారు. కానీ పెద్దలుగా ఉన్న పెత్తందారీ శక్తులు వివిధ రకాల సాకులతో, లిటిగేషన్లతో పంపకాలకి పూనుకోలేదు. అలాంటి స్థితిలో ప్రజలంతా ఒక విప్లవపార్టీ సహకారం తీసుకొని, ఈ భూములను పంచుకోవాలనే వాతావరణం బలంగా ఏర్పడ సాగింది. దీనిని గమినించిన పెద్దలు 6 సంవత్సరాల క్రితం న్యూడెమోక్రసి పార్టీ నాయకత్వాన్ని కలిసి తమకు నాయకత్వం వహించమని, భూములు పంపకం చేపట్టమని కోరారు. నాటి నాయకత్వం అందుకు అంగీకరించింది. ప్రతి కుటుంబానికి రేషనుకార్డు ఉన్న అందరికీ రెండెకరాలు చొప్పున పంపకం చేపడతామని ప్రకటించింది. అప్పటికే జరిగిన అవకతవకలను సరిచేస్తామని చెప్పింది. కానీ ఆచరణలో గత 6 సంవత్సరాలుగా పంపకం జరగలేదు. భూ పోరాటానికి, భూ పంపకం అనంతరం పంచబడిన భూములకు బాధ్య వహించి నిలబడగలిగిన నూతన రాజకీయ శక్తులను అభివృద్ధి చేసుకోవాల్సిన క్రమం చేపట్టలేదు. భూ పోరాటాలకు గ్యారంటీ నిచ్చే రాజకీయ, నిర్మాణ పునాదిని ఏర్పరచుకునే కృషిని చేపట్టలేదు.

ప్రజలపై వున్న పెత్తందారీ శక్తులనే తన నిర్మాణంగా భావించింది. ఫలితంగా ఏ సక్రమ పంపకాన్ని ప్రజలు న్యూడెమోక్రసీని కోరారో అది నెరవేరకపోగా కొందరు పెద్ద మనుషులు ప్రజలతో సంబంధం లేకుండా ఉన్న వారు ఆ పోడు భూముల్లో కొన్ని ఎకరాల భూములను మైనింగ్ మాఫియాలకు, రియల్ ఎస్టేట్ వాళ్ళకు ఇతర బయట వ్యక్తులకు అమ్మడం ప్రారంభించారు. కొందరు, 2 ఎకరాలకు మించి 10 ఎకరాల వరకు సొంతంగా ఆక్రమించుకొని బావులు తవ్వకొని వ్యవసాయం ప్రారంభించారు. ప్రజలకు సంబంధంలేని ఈ చర్యలతో ప్రజలు మరింత నిరుత్సాహానికి, ఆందోళనకి గురయ్యారు. తమ పోరాట ఆకాంక్షలకు, కోరికలకు న్యాయం చేసే నాయకత్వం కోసం వెతుకులాట ప్రారంభించారు. ఫలితంగా 2012 ప్రారంభం నాటికి రైతుకులీసంఘం (ఆం.ప్ర.)ను గ్రామంలోని అత్యధిక కుటుంబాలు (సుమారు 20 కుటుంబాలు మినహా) 300 కుంటుంబాలపైగా రైతుకూలీ సంఘం నాయకత్వాన్ని ఆహ్వానించారు.

దీనితో మరల సంఘర్షణ క్రమం ప్రారంభమైంది. 18-2-2012న చిలకమ్మనగర్‌లోని 250 కుటుంబాల ప్రజలు రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో గ్రామంలో ప్రజా ప్రదర్శన ప్రారంభించారు. ప్రజలంతా కలసి నిర్మించుకున్న జెండా గద్దెవద్దకు చేరుకున్నారు. గ్రామ సీనియర్ కామ్రేడ్ ఈక లచ్చక్క జెండాని ఆవిష్కరించారు. ముఖ్యవక్తగా హాజరైన ఏపిఎఫ్‌టియు వరంగల్‌జిల్లా నాయకులు కామ్రేడ్ మోడెం మల్లేష్ సంఘనిర్మాణ అవసరాన్ని, రాజకీయ పరిస్థితిని, ప్రజలు ఐక్యంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. జిల్లా నాయకులు యం.డి. యాకూబ్, ఈర్ల పైడి, బి. ఆనంద్‌లు ప్రజలకు ఐక్యత గురించిన అనేక అంశాలను వివరించారు. ఈ సభ అనంతరం గతంలోని అవగాహన ప్రకారం కుటుంబానికి 2 ఎకరాల చొప్పున పంపకం కోసం రైతుకూలీసంఘం(ఆం.ప్ర) నాయకత్వాన పోడుభూముల లోకి ప్రవేశించి కొలతలు కొలచుకుంటూ ప్రజలతో కలసి ప్లాట్లు పెట్టుకోవడం మొదలుపెట్టారు. దీంతో పెత్తందార్లుగా ఉన్నవారు రాత్రిళ్ళు బాగాతాగి గొడ్డళ్ళతో ప్రజలపై దాడికి వచ్చారు. ప్రజలు భయపడకుండా ఎదిరించే సరికి మరునాటి నుంచి ప్రజలమీద వివిధ రాజకీయ పార్టీల చేత వత్తిడి చేయిస్తూ, పోలీసులతో అక్రమ కేసులు, హత్యాయత్న కేసులు బనాయించడం ప్రారంభించారు. స్థానిక గ్రామ నాయకులు కామ్రేడ్స్ గగువోతు స్వామి, ఈక రాజు తదితరులపై సంఘ నాయకులపై పోలీసులు హత్యాయత్నం కింద కేసులు నమోదు చేశారు. గ్రామ నాయకులు జైళ్ళకిపోయి జామీనులు తీసుకొని బయటకు వచ్చారు. జైళ్ళకెళ్ళినప్పటికీ ప్రజలు నిబ్బరంగా నిలబడి భూములు ప్లాట్లు వేసుకొనే కార్యక్రమం కొనసాగించారు. దీన్ని చూసిన పెత్తందార్లు మరల అక్రమ కేసులుపెట్టి పోలీసులను పిలిపించారు. ఈసారి మాత్రం కార్యకర్తలను, ప్రజలను అరెస్టు చేసి తీసుకువెళ్ళే పోలీసు జీపుకి అడ్డంగా వందలమంది ప్రజలు నిలబడి వరసపెట్టి సాగుతున్న అక్రమ అరెస్టులను ప్రశ్నించారు. దీనితో అరెస్టు చేసినవార్ని వదిలిపెట్టి పోలీసులు వెళ్ళిపోయారు. దీని వెంటనే వందల మంది ప్రజలు నర్సంపేట ఏయస్‌పి కార్యాలయం వద్దకు చేరి వరుసగా చేస్తున్న అక్రమ అరెస్టులను నిరసిస్తూ తమ భూ పోరాట సమస్యలను వివరించారు. నర్సంపేటలో ప్రదర్శన చేశారు. దాని తర్వాత కూడా ప్రజలపై, నాయకులపై పెత్తందార్లు దాడులు చేస్తుండడం; వాటిని ప్రజలు తిప్పికొడుతూ పోలీస్‌స్టేషన్లకి, కోర్టులకి తిరుగుతూనే భూములు ప్లాట్లు వేసుకునే కార్యక్రమం పూర్తిచేసుకొన్నారు. 750 ఎకరాలపైగా భూమి ఆ విధంగా ప్లాట్లుగా విడదీయటం జరిగింది. గతంలో కార్డువున్న వారికే భూమి అని కాక స్థిరంగా అక్కడ నివాసం ఉన్న పేదలు అందరికీ కుటుంబానికి 2 ఎకరాలు చొప్పున పంపకాలు జరుపుకున్నారు. వివాదంలో వున్న కొంత భూమి మినహా మిగిలిన భూములు పంపకం జరిగింది. లిటిగెంట్లు, పెత్తందార్లు, తమ స్వంత ప్రయోజనం కోసం ప్రజల పోరాట ఫలితాలను బలి పెట్టాలనుకొనేవారు ఏ పార్టీల పేరుతో ఉన్నా ప్రజావ్యతిరేకులేనన్న వైఖరిలో ప్రజలున్నారు. తమ ఐక్యతను, పోరాటాన్ని ముందుకు గొనిపోవాలనే పట్టుదలతో ఉన్నారు.

ప్లాట్ల విడదీత, పంపకం పూర్తయిన సందర్భంలో పెరుగుతున్న ధరలు తగ్గాలని, గిట్టుబాటుధరలకై పోరాడాలనే పిలుపుతో బహిరంగసభ 17-4-2012న చిలకమ్మనగర్‌లో జరిగింది. కామ్రేడ్ గగులోతు స్వామి అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగసభలో రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కోటయ్య ముఖ్య ఉపన్యాసకులుగా హాజరైనారు. పెరుగుతున్న ఆర్థిక, రాజకీయ సంక్షోభంలో ప్రజలు పోరాడాల్సిన అవసరాన్ని గుర్తుచేసారు. వరంగల్ జిల్లాలో రామనర్సయ్య వంటి అమరులు సాగించిన కృషి, వేసిన ఉద్యమ, పోరాట బాటలో పయనించాల్సిన అవసరాన్ని వివరించారు. ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు మోడెం మల్లేష్, రైతుకూలీసంఘం రాష్ట్ర నాయకులు యం.డి. యాకూబ్, నవయువసమాఖ్య నాయకులు ఈర్ల పైడి, వరంగల్‌జిల్లా రైతుకూలీసంఘం అధ్యక్షులు బి.ఆనంద్‌లు ప్రజల పోరాట అవసరాన్ని, చిలకమ్మనగర్ ప్రజలు పోడు పోరాట క్రమంలో ఎదుర్కొన్న అక్రమ కేసులను, భూ పోరాటాన్ని, ప్రజల ఐక్యతను రక్షించుకోవాలని వివరించారు. అనంతరం మాట్లాడిన స్థానిక గ్రామ నాయకులు ఇప్పుడు పోరాడకపోతే నిలబడలేమని వివరించారు. కామ్రేడ్ పాపన్న ఆధ్వర్యంలో కళాకారులు ఉత్తేజ పూరితమైన పాటలుపాడారు. ✡

## నెక్కొండ రైల్వే గోడౌన్లలో ఉపాధి కల్పించమన్నందుకు అక్రమ హత్యాయత్నం కేసు




నెక్కొండలో గోదాముల పనుల సమస్యపై ప్రదర్శన

**వరంగల్ జిల్లా** నెక్కొండలో రైల్వేలైను సమీపంలో చల్లా శ్రీనివాసరెడ్డి అనే అతను ప్రభుత్వ అవసరాలకోసం ప్రైవేటుగా 20 గోడౌన్ల నిర్మాణం తలపెట్టాడు. దీనికోసం కల్లుగీత సంక్షేమం కోసం కేటాయించిన భూమిని, పక్కన రైతులభూమిని మొత్తం 35 ఎకరాల విస్తీర్ణంలో గోడౌన్ల నిర్మాణం ప్రారంభించాడు. వీటికోసం గీత కార్మికుల గీత కోసం ఉద్దేశించిన తాటి వనాలను ధ్వంసం చేయగా 90 మందికి పైగా గీత కార్మికులకు గీసుకొనే చెట్లులేక ఉపాధి కోల్పోయారు. అంతేగాక నిర్మిస్తున్న గోదాములలో ఉపాధి కోరుతున్న హమాలీలు ఎవరైనా 1 లక్ష 5వేలు యజమానికి చెల్లించాలని షరతువిధించాడు. కార్మికులను ఎక్కువ సంఖ్యలో చేర్పించిన ఏజెంట్లకి 5 వేల రూపాయలు ఇస్తానని, మిగిలిన 1లక్ష తనవని ఆశపెడుతూ వివిధ రాజకీయ శక్తులకు ఎరవేసాడు.

దీనిపై ప్రభుత్వం కదిలి 1 లక్ష 5 వేలు వసూలు చేయాలన్న శ్రీనివాసరెడ్డి నిర్ణయాన్ని నిలుపుదల చేయాలని, తీవ్ర కరువు ప్రాంతంగా వున్న నెక్కొండలో నిరుపేదలైన స్థానిక హమాలీలు పైసలు చెల్లించలేరని, ఏపిఎఫ్‌టియు గత డిసెంబరు నుంచి ఆందోళన ప్రారంభించింది. దీనికొరకు నెక్కొండ, దీక్షకుంట్ల, చంద్రుకొండ, గొల్లపల్లె, సూరిపల్లి, లింగగిరి, పెదకొర్పోలు, తదితర గ్రామాలలోని దళిత, ఆదివాసీ ప్రజలకు వాటిలో ఉపాధికల్పించేలా ప్రభుత్వం చూడాలని డిమాండ్ చేస్తూ 5-12-2011న నెక్కొండ తాసీల్దార్ కార్యాలయం వద్ద 400 మంది కార్మికులతో పెద్దఎత్తున ధర్నా నిర్వహించింది. దీని తర్వాత మహబూబాబాద్ ఆర్.డి.వో. కార్యాలయం ముందు మరో ప్రదర్శన జరిపి అర్.డి.ఓని కలిసి విజ్ఞప్తి చేయడం జరిగింది. దీనిపై ఆర్‌డిఓ శ్రీనివాసరెడ్డిని పిలిపించి చర్చలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చాడు.

దీనిపై శ్రీనివాసరెడ్డి వివిధ కార్మిక సంఘాలను ముఖ్యంగా విప్లవ కార్మిక సంఘంగా చెప్పుకొనే సంఘాలను సంప్రదించి ఏపిఎఫ్‌టియు చేస్తున్న డిమాండ్, ప్రభుత్వం పై చేస్తున్న వత్తిడి లేకుండా చేసేందుకువారి సహకారం కోరి దానికి తగిన విధంగా హామీ పొందాడు. దీనితో ఆర్‌డిఓ పిలుపును ఖాతరు చేయకుండా వ్యవహరించడమేగాక ఏపిఎఫ్‌టియును, ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యాన ఏర్పడిన గోదాము పోరాట కమిటి కార్మికులను భయభ్రాంతులను చేయడానికి కార్మికుల పైన, కార్మిక సంఘ నాయుకులైన కామ్రేడ్ మోడెం మల్లేష్, యం.డి. యాకూబ్‌లపైనా కార్మికులైన మోడెం మల్లయ్య, కంకనోల మహేందర్, వెంకన్న తదితర కార్మికులమీద హత్యాయత్నం కేసు నమోదు చేయించాడు. ఎలాంటి ఘర్షణ జరగకుండానే, ఎలాంటి గాయాలు, మెడికల్ సర్టిఫికెట్ లేకుండానే పోలీసు అధికార యంత్రాంగం కార్మికులను అరెస్టు చేసేందుకు దాడులు ప్రారంభించింది. మరో పక్క పత్రికలు, మీడియా 'కాంగ్రెస్ కోటలో ఎం-ఎల్ పార్టీ పాగా' అంటూ కార్మికుల న్యాయమైన ఆందోళనకు రాజకీయరంగు పులిమి ప్రజా వ్యతిరేకులంతా ఒక్కటయ్యేలా వార్తలు ప్రచురించారు.

ఈ అక్రమ అరెస్టులను, కేసులను ఖండిస్తూ ఏపిఎఫ్‌టియూ, అనంతరం ఏఐఎఫ్‌టియు (న్యూ)గా ఏర్పడి ఆందోళన సాగించింది. ఏఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సి. పెద్దన్న ఇక్కడకు వచ్చి కార్మికులతో ఉండటంతోపాటు, వరంగల్ జిల్లా కలెక్టరును కలసి విజ్ఞాపనపత్రం ఇచ్చి స్థానికులకు ఉపాధి కల్పించడానికి లక్షల రూపాయల చెల్లింపులను రద్దు చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్రమ కేసులపై అరెస్టు అయినవారు కోర్టుబెయిలు పొంది కార్మికులను కదిలించి కృషి సాగిస్తున్నారు.

ఈ పరిణామాలను చూస్తే వివిధ రాజకీయ సంపన్న వర్గాలు చట్టాలను, అధికారులను తమ స్వప్రయోజనంకోసం వాడుతున్న తీరును అక్రమ హత్యాయత్నం కేసులు, అరెస్టులక్రమాన్ని తెలియ జేస్తున్నాయి. ప్రజాతంత్ర ఉద్యమ శక్తుల అండతో కార్మిక, రైతు, కూలీ, ఆదివాసీ, దళిత ప్రజలు భూమి కోసం ఉపాధి కోసం, అక్రమ మైనింగ్‌కి వ్యతిరేకంగా పర్యావరణ పరిరక్షణకోసం నిలబడటం తప్ప మరే మార్గం మిగలటం లేదని కూడా ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ✡

## కా॥ పీతా శివన్నాధం వర్ధంతి సభ

**పెదపట్నం, 2-5-12 :**

కాంగ్రెసు గూండాలచే హత్యగావించబడిన రైతుకూలీసంఘం జిల్లా నాయకుడు కా॥ పీతా శివన్నాధం వర్ధంతిసభ కా॥ నాగేశ్వరరావు అధ్యక్షతన కృష్ణాజిల్లా మచిలీపట్నం మండలం పెదపట్నంలో జరిగింది. రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కా॥ అంజమ్మ ఈ సభలో ప్రసంగిస్తూ, కా॥ శివన్నాధం కోడూరు ప్రాంతంలో రైతులను, కూలీలను కూడగట్టి వారి సమస్యలపై ఉద్యమించాడన్నారు. బడా సంపన్నులు, కార్పొరేట్ సంస్థలు తీరప్రాంతంలో బంజరు భూములను కబళించే చర్యలను సంఘం ఆధ్వర్యంలో కా॥ శివన్నాధం అడ్డుకుని, భూస్వాములకు కంటిగింపై, గూండాల చేతిలో హత్యకు గురయ్యారన్నారు. ఈ సభలో ఇంకా మల్లేష్ (ఎన్‌వైఎస్), కా॥ తిరుమలశెట్టి నాగమణి (స్త్రీ విముక్తి సంఘటన) ప్రసంగిస్తూ కా॥ శివన్నాధంకు జోహార్లర్పించారు. బాలకళాకారులు విప్లవ గేయాలు ఆలపించారు, నృత్యాలు ప్రదర్శించారు. ✡

## కా॥ చండ్ర శ్రీమన్నారాయణ వర్ధంతి సభ

**నందిగామ, 7-5-12 :**

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) కృష్ణాజిల్లా నాయకులు కా॥ చండ్ర శ్రీమన్నారాయణ నాలుగవ వర్ధంతి సందర్భంగా కమ్మవారిపాలెంలోని ఆయన స్థూపంవద్ద సీనియర్ కమ్యూనిస్టు కా॥ రావెళ్ళ కళింగరావు, వివిధ ప్రజాసంఘాల నాయకులు తొలుత నివాళులర్పించారు.

అనంతరం రావెళ్ళ కళింగరావు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ మాట్లాడుతూ పాలకుల దోపిడీవర్గ విధానాల ఫలితంగా అన్ని సెక్షన్ల ప్రజానీకం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. ఈ దోపిడీవ్యవస్థను కూలదోసి నూతన ప్రజాస్వామిక వ్యవస్థ స్థాపనా లక్ష్యంతో ముందుకు సాగిన కా॥ శ్రీమన్నారాయణ వంటి కామ్రేడ్స్ యొక్క ఆశయాలను,ఆచరణలను ముందుకు గొనిపోవాలన్నారు.

ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని 4-5-12న కా॥ చండ్ర శ్రీమన్నారాయణ మెమోరియల్ కమిటి ఆధ్వర్యంలో బాలలకు నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులందజేశారు. ఈ సభలో ఇంకా సంఘం జిల్లా అధ్యక్షులు కా॥ మందా జార్జి, జిల్లా నాయకులు కా॥రాంబాబు తదితరులు మాట్లాడారు. బాల కళాకారుల గేయాలు ఉత్తేజాన్ని నింపాయి. ✡

# తమిళనాడు సిపిఐ ముసుగులో పెత్తందార్లు చేసిన దారుణ హత్య







పెత్తందారుల గూండాల చేతిలో హత్యకు గురైన కామ్రేడ్ కుమార్; హత్యజరిగిన మరునాడు కేలమంగళంలో కా॥ కుమార్ సంతాపసభలో ప్రసంగిస్తున్న సిపిఐ(ఎం-ఎల్) తమిళనాడు రాష్ట్ర నాయకులు కా॥ వింధై వేలన్; సభకు హాజరైన ప్రజానీకం

**కేలమంగళం, 13-5-12 :**

తమిళనాడురాష్ట్రం-కృష్ణగిరిజిల్లా-తళి నియోజక వర్గపరిధిలోని డేగినికోట తాలూకా-కేలమంగళం గ్రామానికి చెందిన సిపిఐ(ఎం-ఎల్) స్థానిక నాయకుడు కా॥ కుమార్ (28)ను సిపిఐ ముసుగులో వున్న అదే నియోజకవర్గ ఎంఎల్ఏ రామచంద్రన్; అతని అన్న వరదరాజన్; మరియు రామచంద్రన్ మామ సిపిఐ రైతుసంఘం రాష్ట్ర కమిటి సభ్యుడైన లగుమయ్యలు పథకం ప్రకారం, కిరాయి గూండాలతో పట్టపగలు హత్యగావించారు.

పేరుకు కమ్యూనిస్టు పార్టీ ప్రజాప్రతినిధిగా చెలామణి అవుతున్న రామచంద్రన్, అతని బంధుగణమంతా తళి నియోజకవర్గ పరిధిలో పెద్ద ఎత్తున భూములను, గ్రానైట్ గనులను, క్వారీలు, క్రషర్లను కలిగివుండి వందల కోట్లరూపాయలు పోగేసుకుని వున్నారు. ఫ్యూడల్ భూస్వాముల రీతిలో ఈ ప్రాంతంలో వారి ఆధిపత్యం చెలాయించటానికి తమకు అడ్డువచ్చే వారిపై భౌతిక దాడులు చేయటం, హత్యగావించటమనేది వారి దిన చర్యగావుంది. సిపిఐ ఎంఎల్ఏగావున్న రామచంద్రన్ మామ లగుమయ్య 40కి పైగా హత్యల్లో భాగస్వామిగా వుండటంతోపాటు సిపిఐ అనుబంధ రైతుసంఘం రాష్ట్రనాయకుడిగా చెలామణి అవుతున్నాడు.

ఎంఎల్ఏ అతని బంధుగణం తమ ఆస్తులను పెంచుకునే క్రమంలో కేలమంగళం ప్రక్కనున్న నాగమంగళం పంచాయితీ పరిధిలోని వివిధ గ్రామాలలో మూడువేల ఎకరాల భూములను రైతులనుండి బలవంతంగా ఊడబెరుక్కున్నారు. దీనితో ఆ ప్రాంత రైతులలో అలజడి ప్రారంభమైంది.

న్యాయమైన రైతాంగ ఆందోళనకు స్థానిక సిపిఐ(ఎం-ఎల్) నాయకత్వం వహించింది. స్థానిక సిపిఐ(ఎం-ఎల్) నాయకుడైన, కా॥ కుమార్ గత 7,8 సం॥లుగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ, రెండు సంవత్సరాలు పూర్తికాలపు కార్యకర్తగా కూడా పనిచేశాడు. ఈ కామ్రేడ్ ఆధ్వర్యంలో రామచంద్రన్ దోపిడీ, ఆరాచకాలను వ్యతిరేకిస్తూ సంఘ నాయకత్వంలో ఈ సంవత్సరం జనవరి నుండి విస్తృత ప్రచార ఆందోళనా కార్యక్రమం చేపట్టి నిర్వహిస్తున్నారు. బాధిత రైతులను కదిలించి ప్రదర్శనలు నిర్వహించటంతోపాటు, జిల్లా కేంద్రమైన కృష్ణగిరిలో పెద్దఎత్తున ధర్నా చేపట్టి ఎంఎల్ఏ సాగిస్తున్న దుర్మార్గాలను లోకానికి వెల్లడి చేశారు.

ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత సంఘటిత రూపం తీసుకోవటాన్ని చూసి సహించలేని పెత్తందారులు భౌతికదాడులతో రైతాంగాన్ని ఛిన్నాభిన్నం చేసేందుకు పూనుకున్నారు పెత్తందారు రామచంద్రన్ స్వగ్రామమైన వరగానిపల్లె పొరుగునున్న నీలగిరి గ్రామంపైకి కిరాయి గూండాలను ఉసిగొలిపి పంపించారు. నీలగిరి రైతులు దీనిని సంఘటితంగా ఎదుర్కొని దాడి చేసిన గూండాలను తరిమికొట్టారు.

ఈ పరిణామాల నేపథ్యంలో సిపిఐ (ఎం-ఎల్) ఆధ్వర్యంలో మేడే కార్యక్రమాల నిర్వహణకు, బహిరంగసభకు ఎంఎల్ఏతో కుమ్మక్కైన పోలీసు అధికార యంత్రాంగం సకాలంలో అనుమతినీయ నిరాకరిస్తూ వచ్చింది. అంతిమంగా 13-5-12న కేలమంగళం గ్రామంలోనే మేడే సభను, కామ్రేడ్ లెనిన్ జయంతి సభను కలిపి నిర్వహించ తలపెట్టిన సందర్భంగా పోలీసు అధికారులు అనుమతి మంజూరుచేశారు.

ఈ విధంగా మేడే కార్యక్రమ నిర్వహణలో కామ్రేడ్ కుమార్‌తో సహా కామ్రేడ్స్ అందరూ నిమగ్నమై వున్న సమయంలో ఎంఎల్ఏ అనువుగా ఉపయోగించుకొని దెబ్బతీయదలుచుకున్నాడు. పథకం ప్రకారం కిరాయి గూండాలను పంపించి 12-5-12న మధ్యాహ్నం 1-30 గం॥కు కేలమంగళం బస్టాండు ప్రక్కనే, మోటారు వాహనంపై వస్తున్న కుమార్‌ను కత్తులు, గొడ్డళ్ళు తదితర మారణాయుధాలతోవచ్చిన గూండాలు పడదోసి పట్టపగలు అందరి కళ్ళఎదుటే దారుణంగా హత్యగావించారు. పోస్టర్లు అతికించింది ఈ చేతులే కదా అంటూ ముంజేతులను నరికారు. ప్రక్కటెముకల్లో కత్తులతో పొడిచారు. ఈ హత్య ద్వారా తమ కెదురుగా వచ్చే వారికెవరికైనా ఇదే గతిపడుతుందని హెచ్చరించదలుచుకున్నారు.

స్పృహకోల్పోయిన కామ్రేడ్ కుమార్‌ను మొదట హోసూరు ఆస్పత్రికి, అక్కడనుండి బెంగుళూరు ఆస్పత్రికి తరలించినప్పటికీ అధికరక్తస్రావం వల్ల మృతి చెందారు. కా॥ కుమార్ మరణించిన వార్త తెలుసుకున్న నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. ఎంఎల్ఏ దౌష్ట్యాల్ని నిరసిస్తూ కామ్రేడ్ కుమార్ అంతిమయాత్రను, అంత్యక్రియలను నిర్వహించి ముందుగా నిర్ణయించుకున్న ప్రకారము 13-5-12న కేలమంగళంలో బహిరంగసభ నిర్వహించి కుమార్‌కు ఘన నివాళులర్పించటంతో పాటుగా ఎంఎల్ఏ రామచంద్రన్ మరియు వారి అనూయాయుల ఆగడాలను కొనసాగనీయబోమని, ప్రజల అండతో వాటిని ప్రతిఘటిస్తామని వారిని హెచ్చరించారు. కుమార్ హంతకులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ, పోలీసు అధికారులను డిమాండ్ చేశారు. ఈ సభలో సిపిఐ(ఎం-ఎల్) తమిళనాడు రాష్ట్ర నాయకులు కా॥ విందైవేలన్, సిపిఐ(ఎం-ఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకులు కా॥ కె. కోటయ్య ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కా॥ పెద్దన్న, దళితసంఘం నాయకులు సెంగుట్టాయన్ తదితరులు ప్రసంగించారు. ✡

## ఎస్‌టిఎమ్ కంపెనీ భూములను గిరిజనులకు, ఇతర పేదలకు పంపిణీ చేయాలని ఆందోళన

**పార్వతీపురం, 7-5-12 :**

ఎస్‌టిఎమ్ కంపెనీ భూములను ప్రభుత్వమే స్వాధీనపరుచుకొని గిరిజనులకు, ఇతర పేదలకు పంపిణీ చేయాలని; వాటాదారులను మోసం చేసి కోట్లు కొల్లగొట్టిన కంపెనీ ప్రతినిధులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని; ప్రభుత్వం-కంపెనీ ప్రతినిధులకు, దళారీలకు కటింగ్ ఆర్డరులివ్వకుండా నిలుపుదల చేయాలని; ఎస్‌టిఎమ్ కంపెనీ భూములన్నింటిపై రెవిన్యూ యంత్రాంగం సమగ్రమైన దర్యాప్తు జరిపించాలని; బంజరు, పోరంబోకు, డి.పట్టా, గెడ్డలను సర్వేచేసి ఎస్‌టిఎమ్ కంపెనీ నుండి మినహాయించాలని డిమాండ్ చేస్తూ పార్వతీపురం ఐటిడిఏ కార్యాలయం వద్ద రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా సంఘం విజయనగరం జిల్లా కార్యదర్శి కా॥ డి. వర్మ మాట్లాడుతూ పార్వతీపురం మండలం సంగం వలస పంచాయితీ పరిధిలో స్టెర్లింగ్ ట్రీ మాగ్నమ్ (ఎస్‌టిఎమ్) అనే బోగస్ కంపెనీ 214 ఎకరాలలో టేకు ప్లాంటేషన్ వేసిందనీ, దీనిని చూపించి మధ్యతరగతి ఆదాయవర్గాల వారిని 'ఒక చెట్టు కొనుగోలు చేస్తే లక్షాధికారి అవుతార'ని ప్రలోభపరిచి వారినుండి కోట్లుకొల్లగొట్టి వాటాదారులను ముంచివేసిందనీ, గిరిజన ప్రాంతంలోని ఈ ఏజన్సీ భూములు గిరిజనులకే చెందాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా ఉపాధ్యక్షులు కా॥ బొత్స నరసింగరావు మాట్లాడుతూ ఎస్‌టిఎమ్ భూముల కొనుగోలు సందర్భంగా, ఆ భూములతో పాటుగా, గెడ్డలు, బంజరు, కొండ పోరంబోకు భూములను సైతం కలుపుతున్నారనీ, నేడు ఆ ప్లాంటేషన్‌లో టేకు చెట్లను నరికి అమ్ముకొని కోట్లు సంపాదించటానికి కంపెనీ ప్రతినిధులమని చెప్పుకుంటున్నవారు బయలుదేరారని, వారికి ఈచెట్లపై ఏ విధమైన హక్కులేదని, ప్రభుత్వాధికారులు వారికి ఎటువంటి కటింగ్ ఆర్డర్ మంజూరు చేయరాదని డిమాండ్ చేశారు.

సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కా॥ ఎమ్. భాస్కరరావు మాట్లాడుతూ ఎస్‌టిఎమ్ కంపెనీ చేతిలో మోసపోయిన వాటాదారులకు కంపెనీ యాజమాన్యం నుండి నష్టపరిహారం ఇప్పించాలని, ఈ భూములను సంగంవల్స పంచాయితీ పరిధిలోని గిరిజన, గిరిజనేతర పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సంగంవల్స, కోరీగంగాపురం పంచాయితీల పరిధిలోని గ్రామాలనుండి 250 మంది గిరిజనులు, రైతులు పాల్గొన్నారు. ✡

## 'అమరుల సాక్షిగా కమ్యూనిస్టుల ఐక్యతను కర్తవ్యంగా చేపట్టాలి!'

### కృష్ణాజిల్లా పొద్దుటూరు తొలితరం కమ్యూనిస్టుల సంస్మరణ సభలో వక్తల పిలుపు



అమరుల సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న కా॥ గురవారెడ్డి

**ప్రొద్దుటూరు, 24-5-12 :**

ప్రొద్దుటూరు గ్రామంలో తొలిగా కమ్యూనిస్టుపార్టీ శాఖను ఏర్పాటు చేసిన సుర్యదేవర గోపాలరావు, ఆ శాఖలో సభ్యులుగా వున్న భీమవరపు వెంకటరెడ్డి, మండేపూడి నాగభూషణ రెడ్డి, ఈడా సాంబమూర్తి, భీమవరపు కృష్ణారెడ్డిల స్మారక చిహ్నంగా 1996లో నిర్మించిన అమర స్థూపం వద్ద అమరుల సంస్మరణ సభ ఉత్తేజ పూరితంగా జరిగింది.

స్థూప నిర్మాణ కమిటీ కన్వీనర్ కా॥ ఈడా అక్కతాతయ్య అధ్యక్షులుగా సభను ప్రారంభిస్తూ, ఎన్నో త్యాగాలు చేసి ఎర్రజెండా వన్నె తగ్గకుండా త్యాగపూరిత కృషి చేసిన తొలితరం కమ్యూనిస్టులను తలచుకోవటం ఎంతో గర్వంగా, ఆనందంగా వుందన్నారు.

సిపిఐ (ఎం-ఎల్) కృష్ణాజిల్లా కార్యదర్శి కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ ప్రసంగిస్తూ, పార్టీ ఆశయాలను సాధించటానికి తొలితరం కమ్యూనిస్టులు చేసిన త్యాగాలు ఎనలేనివని వారు ప్రజల్లో మమేకమై పనిచేసిన ఫలితంగా 'కమ్యూనిస్టు' వెంకటరెడ్డిగా, 'సంచి' గోపాలరావుగా, గుడివాడలో పనిచేసిన అట్లూరి సీతారామయ్య 'పాకీ' సీతారామయ్యగా ప్రజల తలలో నాల్కలుగా వెలుగొందారని కాటూరు, ఎలమర్రులలో గాంధీవిగ్రహం సాక్షిగా గ్రామస్తులను దింగంబరులను చేసి, సలసలా మండుతున్న ఇసుకపై వారిని పడుకోబెట్టి మహిళలను వారి ముందు నిలబెట్టి, నెహ్రూకు జిందాబాద్ అనమంటే ఎర్రజెండాకు జిందాబాద్ అని, ఎర్రజెండా నిగనిగలకు మరింత వన్నెతెచ్చిన ఆనాటి వారి త్యాగాలను ఉత్తేజ పూరితంగా వివరించారు. తొలితరం కమ్యూనిస్టుల ఆశయాలు సాధించాలంటే నేడు కమ్యూనిస్టు ఉద్యమంలో ఏర్పడిన చీలికలను అధిగమించి సరైన విప్లవ కమ్యూనిస్టు పార్టీని నిర్మించుకోవాల్సిన కర్తవ్యం మనముందు ఉందనీ, పాలకవర్గాలు చేపట్టిన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలు ప్రజలపై తీవ్రమైన ప్రభావాలు పడవేస్తున్న నేపథ్యంలో కమ్యూనిస్టు శక్తులపై ఎక్కువ బాధ్యత వుంటుందన్నారు. తాజాగా ప్రభుత్వం పెంచిన పెట్రోలు ఛార్జీలు పాలకుల ప్రైవేటీకరణ విధానాల ఫలితమేననీ, ప్రకృతి వనరులైన ఇసుక, ఇనుము, బాక్సైట్,

(తరువాయి 6వ పేజీలో)

*Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010*
*and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2*
*Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010*